

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 12 డిసెంబరు 2024

సంఘం.. శరణం..!

ఏడేళ్లుగా అడహక్ కమిటీ
సిబ్బంది సమస్యలు పట్టని నేతలు
ఒత్తిళ్లకు బలవుతున్న కిందిస్థాయి ఖాకీలు
పోలీసు అధికారుల సంఘం తీరుపై విమర్శలు

(6వ పేజీలో..)



డబ్బులు ఇస్తేనే..!

పరికరాలను పంపిణీ చేయని అధికారి

ట్రై సైకిళ్ల స్పేర్ పార్ట్స్ పక్కదారి
విభిన్న ప్రతిభావంతుల శాఖలో అక్రమాలు



అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల శాఖలో ఓ అధికారి తీరుపై విమర్శలు కొనసాగుతున్నాయి. 'వసూళ్ల విభిన్నం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనంతో బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని ఒక్కొక్కరుగా చెబుతున్నారు. పరికరాలు ఇవ్వకుండా ఆరు నెలల పాటు వేధించాడని వాపోతున్నారు. 372 మందికి పరికరాలు మంజూరు కాగా, పంపిణీ చేయకుండా కాలయాపన చేసినట్లు సమాచారం. వినికిడి యంత్రాలకు 88 మందిని ఎంపిక చేశారు. కానీ ఒక్కరికీ ఇవ్వలేదు. వీల్‌ఛైర్లకు 36, గుడ్డి కర్రలు 03, క్రచ్ ఒకరికి, ట్రైసైకిళ్లు 91, వాకింగ్ స్టిక్స్ 153 మందికి మంజూరయ్యాయి. ఒక్కొక్కరు రూ.2 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. కానీ డబ్బులు ఇవ్వలేకపోవడంతో పంపిణీ చేయకుండా వేధించారని బాధితులు కొందరు వాపోతున్నారు.

బాగున్నవారికి వాహనాలు

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు మంజూరు చేసిన స్కూటర్లను వైకల్యం లేనివారికి పంపిణీ చేశారని సమాచారం. డివిజన్ల వారీగా ఏడు నెలలు క్రితం స్కూటర్ల పంపిణీ పూర్తయ్యాక, తాడిపత్రి డివిజన్‌లో నాలుగు స్కూటర్లు మిగిలినట్లు సమాచారం. పదో తరగతి పాస్ కాని కారణంగా నలుగురిని అనర్హులుగా గుర్తించారు. వారికి మంజూరైన వాహనాలను తిప్పి పంపాలి. లేదంటే దరఖాస్తులు ఆహ్వానించి.. ఇతర అర్హులకు ఇవ్వాలి. కానీ కాసులకు అలవాటు పడిన ఆ అధికారి ఒక్కొక్కరి నుంచి రూ.60 వేలు తీసుకుని నాలుగు స్కూటర్లను ఇచ్చేశారని ప్రచారం జరుగుతోంది.

స్పేర్‌పార్ట్స్ విక్రయం

బళ్లారి బైపా‌స్‌లో ఉన్న ట్రైసైకిళ్ల ప్రొడక్షన్ సెంటర్‌లో ట్రైసైకిళ్ల పంపిణీ అనంతరం మిగిలిన స్పేర్‌పార్ట్స్‌ను ఆ అధికారి విక్రయించినట్లు తెలిసింది. తనకు అనుకూలమైన సిబ్బంది ద్వారా నగరంలోని ఓ సైకిల్ గోడౌన్‌కు వాటిని తరలించి అమ్మినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై ప్రశ్నించిన ఓ ఉద్యోగి వేధించారని సమాచారం. ఆ ఉద్యోగి ఈ విషయాన్ని పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా.. మామూళ్లతో కథ సుఖాంతం చేసుకున్నట్లు సమాచారం.



అక్కడే చుక్క... ఎంచక్కా..!

మద్యం దుకాణాల వద్ద తాగుడు

సూర్యానగర్ రోడ్డులోని మద్యం షాపు వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌లో తాగుతున్న మద్యం ప్రియులు





శ్రీకంఠం సర్కిల్లో మద్యం షాపు వద్ద మంచింగ్ ఏర్పాట్లు

- దర్జాగా పర్మిట్ రూమ్‌ల ఏర్పాటు
- పోలీసులు, ఎక్సైజ్ శాఖ ప్రేక్షక పాత్ర

అనంతపురం అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారుల కట్టు తప్పుతున్నారు. కొన్నచోటే తాగేలా దర్జాగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని చాలా మద్యం దుకాణాల వద్ద అనధికారికంగా పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో మందుబాబులు అక్కడే మజా చేసుకుంటున్నారు. కానీ ఈ పరిణామాలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా అనంతపురం నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ తంతు సాగుతోంది. రెస్టారెంట్ల తరహాలో పర్మిట్ రూమ్‌లను నిర్వహిస్తున్నా.. ఎక్సైజ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. పోలీసులు మాత్రం దుకాణదారులను వదిలేసి.. అక్కడ తాగుతున్నవారిపై పడుతున్నారు.

నగరంలో జోరుగా..

అనంతపురం నగరంలో శ్రీకంఠం సర్కిల్ సమీపంలోని రెండు, హౌసింగ్ బోర్డులోని రెండు, కళ్యాణదుర్గం రోడ్డు తారా మసీదు వద్ద ఒకచోట, సూర్యానగర్ రోడ్డులోని స్టార్ డయాగ్నస్టిక్స్ సమీపంలోని ఒకచోట, కమలానగర్ బాషా హోటల్, సింధూర బార్ సమీపంలో, గుత్తి రోడ్డు మిర్చి యార్డ్ సమీపంలోని రెండు మద్యం షాపులు, కలెక్టరేట్ సమీపంలోని ఓ మద్యం షాపు, బళ్లారి రోడ్డు సర్కిల్ సమీపంలోని రెండు షాపులు, బళ్లారి రోడ్డు టీవీఎస్ షోరూం సమీపంలో ఒక మద్యం షాపు వద్ద పర్మిట్ రూమ్‌లు ఏర్పాటయ్యాయి. చూసేందుకు అక్కడ బార్ అండ్ రెస్టారెంట్ ఉందా అనేలా పరిస్థితి తయారైంది. హౌసింగ్ బోర్డు, కళ్యాణదుర్గం రోడ్డు, టీవీఎస్ షోరూం సమీపంలోని మద్యం షాపుల వద్ద చుట్టూ బండలు నాటిన ప్రాంతంలో బహిరంగంగానే మద్యాన్ని తాపిస్తున్నారు. దీంతో పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హోటళ్లలోనూ తాగేస్తున్నారు..

ఉవరకొండ, వజ్రకరూరు, తాడిపత్రి, బెళుగుప్ప మండలాల్లోని దాదాపు అన్ని మద్యం దుకాణాల వద్ద అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. రాయదుర్గం ప్యాలెస్ రోడ్డు మటన్ మార్కెట్ వద్ద భారీ పర్మిట్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లులోని పలు హోటళ్లలో అనధికారికంగా మద్యాన్ని తాపిస్తున్నారు. విషయం తెలిసినా, స్థానిక పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు పట్టించుకోవడం లేదు. పర్మిట్ రూమ్‌లను మూసివేయించి, జరిమానా విధించాల్సిన అధికారులు మౌనం వహించడం విమర్శలకు తావిస్తోంది. కమలానగర్ బాషా హోటల్ వద్ద పర్మిట్ రూమ్‌లో మద్యం తాగుతున్నవారిపై పోలీసులు ప్రతాపం చూపినట్లు తెలిసింది. కానీ నిర్వాహకులను మాత్రం పల్లెత్తుమాట అనలేదట. పోలీసులు ఆకస్మిక తనిఖీలకు వెళుతున్నా.. ఆ సమయంలో మద్యం తాగేవారిని పంపిస్తున్నారు. పోలీసులు వెళ్లిపోగానే దందా మళ్లీ మొదలౌతోంది.



హౌసింగ్ బోర్డులోని మద్యం షాపు పక్కన...

బార్.. బేర్..

మద్యం షాపుల వద్ద అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేయడంతో బార్ అండ్ రెస్టారెంట్లలో వ్యాపారం తగ్గుతోంది. ఎక్కువ మొత్తానికి టెండర్లల్లో బార్ అండ్ రెస్టారెంట్లను దక్కించుకున్నవారు లబోదిబోమంటున్నారు. వైసీపీ హయాంలో కొందరు బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించలేదు. అధిక రేట్లకు మద్యం విక్రయించారు. బయటకు పార్శిల్ ఇస్తూ దండుకున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తెచ్చాక బార్ అండ్ రెస్టారెంట్లల్లో ధరలను తగ్గించారు. కానీ ప్రైవేటు మద్యం షాపుల వద్ద తాగేందుకు అవకాశం కల్పించడంతో తమ వ్యాపారం పడిపోతోందని వారు అంటున్నారు.



సీఎం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న అనంత కలెక్టరు వినోద్‌కుమార్

ఉద్యాన పంటలపై చర్చ

నేడు అభివృద్ధి.. సంక్షేమంపై సీఎం సమగ్ర సమీక్ష

అనంతపురం టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అమరావతిలో సీఎం చంద్రబాబు నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో తొలిరోజు ఉద్యాన పంటల గురించి కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వివరించారు. సీఎంతో పాటు మంత్రులు వివిధ అంశాల గురించి ప్రస్తావించారు. ప్రజల కోసం ఎలా పనిచేయాలో కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. రైతుల అభివృద్ధికి ఉద్యాన పంటలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని కలెక్టర్ వివరించారు. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం, దిగుబడులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం గురించి ప్రధానంగా చర్చ జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సాగవుతున్న ఉద్యాన పంటల గురించి సీఎం, మంత్రులు ఆరా తీశారని, మరింత అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారని ఆయన అన్నారు. జిల్లాల వారీగా అభివృద్ధి-సంక్షేమం గురించి గురువారం పూర్తిస్థాయి చర్చ జరగనుంది. ఆ సమయంలో జిల్లా నుంచి తీసుకు వెళ్లిన ప్రణాళికను కలెక్టర్ సీఎం చంద్రబాబుకు వివరిస్తారని సమాచారం.

నార్పలకు వీరజవాన్ పార్థివ దేహం

నేడు అంత్యక్రియలు



నార్పల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో తీవ్రవాదులు అమర్చిన ల్యాండ్‌మైన్ పేలి వీరమరణం పొందిన జవాన్ వెంకటసుబ్బయ్య పార్థివ దేహం బుధవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో నార్పలకు చేరుకుంది. జమ్మూ కశ్మీర్ నుంచి బెంగళూరుకు ఆర్మీ అధికారులు జవాను పార్థివ దేహాన్ని తీసుకొచ్చారు. అక్కడి నుంచి మిలిటరీ వాహనంలో నార్పలకు తరలించారు. నార్పల మండలంతో పాటు చుట్టు పక్కల గ్రామాలు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు నార్పలకు చేరుకుని వీర జవానుకు ఘన నివాళులర్పించారు. జవాను పార్థివ దేహం నార్పలకు చేరుకోగానే రోడ్డుకు ఇరువైపులా వందలాది మంది నిలబడి కొవ్వొత్తులు పట్టుకుని జోహార్లు అర్పించారు. జాతీయ జెండాను చేత పట్టుకుని నినాదాలు చేశారు. వెంకటసుబ్బయ్యకు గురువారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు. అంత్యక్రియలకు ఆయన స్వస్థలం ప్రకాశం జిల్లా రాయపాడు నుంచి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు నార్పలకు చేరుకున్నారు.

కుటుంబ సభ్యులకు పరామర్శ

జమ్మూలోని పూంచ్ సెక్టార్‌లో 30 మంది సైనికులను కాపాడి ప్రాణ త్యాగం చేసిన జవాన్ వెంకటసుబ్బయ్య కుటుంబాన్ని పలువురు జిల్లా అధికారులు పరామర్శించారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా పోలీసు అధికారులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.



నార్పల చేరుకున్న జవాన్ పార్థివ దేహం



ఫ్లెక్సీలు, కొవ్వొత్తులతో స్థానికుల ప్రదర్శన



జవాన్ కుటుంబసభ్యులకు అధికారుల పరామర్శ..

ఆ ఒక్కటీ అడక్కు!

పొదుపు సొమ్ము ఇవ్వని బ్యాంకర్లు



- ఒక్కో సంఘం ఖాతాలో రూ.2 లక్షలకు పైగా..
- రుణంపై భారీగా వడ్డీ.. పొదుపు సొమ్ముపై నామమాత్రం
- బ్యాంకర్ల తీరుపై పొదుపు మహిళల మండిపాటు

యల్లనూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పొదుపు మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో అలాగే ఉంచితేనే డ్వాక్రా మహిళలకు బ్యాంకు రుణాలు అందుతున్నాయి. ఎలాంటి గ్యారెంటీ లేకుండా ఒక్కొక్క సంఘానికి రూ.20 లక్షలకు పైగా రుణాలు ఇస్తున్నామని బ్యాంకు అధికారులు చెబుతున్నారేగాని, పాటించడం లేదు. రుణం కావాలంటే పొదుపు మొత్తాన్ని ఖాతాలోనే ఉంచాలని షరతు పెడుతున్నారు. యల్లనూరు మండలంలో సుమారు 750 సంఘాలు ఉన్నాయి. యల్లనూరు యూనియన్ బ్యాంకులో 250 సంఘాల ఖాతాలు ఉన్నాయి. వెన్నపూసపల్లి, తిమ్మంపల్లి బ్యాంకుల్లో మిగిలిన సంఘాల ఖాతాలు ఉన్నాయి. సభ్యులు ప్రతినెలా రుణానికి సంబంధించిన కంతులు చెల్లిస్తూ.. వంద రూపాయలు చొప్పున పొదుపు చేసుకుంటున్నారు. ఈ పొదుపు మొత్తం రూ.30వేల దాటగానే, సంఘంలో అవసరం ఉన్న సభ్యురాలు వడ్డీకి రుణం తీసుకోవచ్చు. కానీ ఐదేళ్ల నుంచి ఏ ఒక్క సంఘానికీ పొదుపు సొమ్ము నుంచి రుణం ఇచ్చిన దాఖలాలు లేవు. పొదుపు మొత్తం ఎక్కువగా ఉందని, రుణం తీసుకుంటామని ఐకేపీ అధికారుల వద్దకు వెళితే.. బ్యాంకు అధికారులు ఇవ్వడం లేదని చెబుతున్నారని సభ్యులు వాపోతున్నారు.

వడ్డీలో తేడా..

పొదుపు సంఘాల సొమ్ము బ్యాంకులో ఉంచినా తక్కువ వడ్డీ వస్తోంది. ఒక్కొక్క సంఘం రూ.2లక్షలకు పైగా పొదుపు సొమ్మును బ్యాంకు ఖాతాలలో ఉంచాయి. దీనిపై చాలా తక్కువ వడ్డీ వస్తోంది. కానీ రుణం తీసుకుంటే మాత్రం అధిక వడ్డీ విధిస్తున్నారని పొదుపు మహిళలు అంటున్నారు. తమ పొదుపు సొమ్మును రుణానికి జమ చేస్తే వడ్డీ భారం తగ్గుతుందని అంటున్నారు. కానీ తమ మాట ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. 'రుణం కావాలంటే ఎక్కువగా ఇస్తాం.. పొదుపు సొమ్ము మాత్రం తీసుకునేందుకు వీలు లేదు..' అని బ్యాంకు అధికారులు చెబుతున్నారని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణం కంతులు చెల్లించకపోతే పొదుపు మొత్తం నుంచి వెంటనే ఆ సొమ్మును జమ చేసుకుంటున్నారని, సభ్యులలో ఎవరో ఒకరు కంతు చెల్లించకుంటే మిగిలిన వారి పొదుపు సొమ్ము నుంచి జమ చేసుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఐదేళ్లుగా ఖాతాలోనే..

పొదుపు సంఘాల డబ్బులు వైసీపీ హయాం నుంచి బ్యాంకు ఖాతాలలోనే మగ్గుతున్నాయి. ఎస్‌బీ ఖాతాలోని మొత్తానికి వడ్డీ నామమాత్రంగా ఉంటోంది. కానీ బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి 90 పైసలకు పైగా వడ్డీ పడుతోంది. తద్వారా సంఘాల సభ్యులు 50పైసలకు పైగా నష్టపోతున్నారు. ఈ సమస్యను గత ప్రభుత్వంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇవ్వడం లేదు..



కొన్ని సంవత్సరాల నుంచి ప్రతినెలా పొదుపు మొత్తం చెల్లిస్తున్నాం. కానీ ఆ మొత్తాన్ని తీసుకుంటామంటే బ్యాంకు అధికారులు ఒప్పుకోవడం లేదు. ఎన్ని సంవత్సరాలు పొదుపు మొత్తాన్ని ఖాతాలో ఉంచాలో అర్థం కావడం లేదు. రెండేళ్లకు ఒకసారి బ్యాంకు రుణాన్ని పెంచుతున్నారు. రుణం మొత్తంలోకి పొదుపు మొత్తాన్ని జమచేసుకోవాలని కోరినా వినడం లేదు. అది అలాగే ఉంచుకోండి.. రుణం మొత్తాన్ని పెంచుతున్నాం కదా అంటున్నారు.

- వరలక్ష్మి, పొదుపు మహిళ

పరిష్కరించడం లేదు..



డ్వాక్రా మహిళల పొదుపు మొత్తాన్ని సభ్యులకు ఇవ్వడానికి బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్నాం. ఇస్తామని చెబుతున్నారే గానీ సమస్యను పరిష్కరించడం లేదు. ఈ విషయాన్ని బ్యాంకు అధికారుల సమావేశంలో కూడా చర్చించాము. ప్రతి సంఘం ఖాతాలో రూ.2 లక్షలకు పైగా పొదుపు సొమ్ము ఉంది.

- ముత్యాలప్ప, ఏపీఎం

మావాళ్ని పంపిస్తున్నా!

సదరం సర్టిఫికెట్ ఇచ్చెయ్

ఒత్తిడి పెట్టి ...

- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం
- శింగనమల మండలంలో అనర్హులకు పింఛన్లు..!
- వాటిని ఏరివేయాలని మొదలైన డిమాండ్లు

శింగనమల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల ఒత్తిడితో మండలంలో అధికారులు ఇష్టారాజ్యంగా సదరం సర్టిఫికెట్లు జారీ చేశారు. దీంతో గత టీడీపీ పాలనలో 400 ఉన్న దివ్యాంగుల పింఛన్ల సంఖ్య 1200కి పెరిగింది. ఇందులో అనర్హుల సంఖ్య చాలా ఎక్కువ ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సదరం సర్టిఫికెట్లు ఇప్పించడంలో వైసీపీ నాయకులతో పాటు వలంటీర్లు కీలకంగా పని చేశారు. ప్రస్తుతం అధికారం మారిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పింఛన్ల తనిఖీ చేపట్టి అనర్హులను ఏరివేయాలని డిమాండ్లు ఊపందుకున్నాయి. మండలంలో 6,564 వివిధ రకాల పింఛన్లు ఉన్నాయి. ఇందులో వృద్ధాప్య పింఛన్ల 3505, దివ్యాంగుల పింఛన్ల 1271, వితంతు పింఛన్ల 1188తోపాటు ఇతర పింఛన్లు ఉన్నాయి. అయితే గత టీడీపీ హయాంలో 400పైగా ఉన్న దివ్యాంగులు పింఛన్లు ఐదేళ్ల వైసీపీ పాలనలో 1271కి పెరిగాయి.


పింఛను పంపిణీ రసీదు
C.NO : 11290427002 తేది: 01/07/2024
జిల్లా : అనంతపురము
మండలం : సింగనమల
గ్రామ/వార్డు సచివాలయము : W.NARSAPURAM
పింఛను ఐడి : 11200067006
శ్రీ/శ్రీమతి/కుమారి Chinthakunta Nagaratnamma
రూ. 6000 /-

C.NO : 11290427002 తేది: 01/07/2024
జిల్లా : అనంతపురము
మండలం : సింగనమల
గ్రామ/వార్డు సచివాలయము : W.NARSAPURAM

అర్హత లేకున్నా పింఛను పొందుతున్న లబ్ధిదారులు

వైసీపీ పాలనలో కొందరు నాయకులు సదరం సర్టిఫికెట్ ఇచ్చే అధికారులకు ఫోన్ చేసి' నీ రెటెంతో చెప్పు. మా వాళ్లు వస్తారు. వారికి పింఛన్లకు అవసరమైన 40 శాతం దివ్యాంగత్వం ఉన్నట్లు సర్టిఫికెట్లు ఇవ్వండి' అని ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఈక్రమంలోనే కొందరు వైసీపీ నాయకులు, వలంటీర్లు కొందరు తమ బంధువులకు సదరం సర్టిఫికెట్ ఇప్పించుకుని దివ్యాంగుల పింఛన్ పొందుతున్నారు. ప్రస్తుతం వీరికి నెలకు రూ.ఆరు వేల పింఛన్ లభిస్తోంది. అనర్హులు ఇలా పింఛన్ పొందుతుండటంతో ప్రభుత్వ ధనం వృథా అవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనర్హులను ఏరివేయాలని కోరుతున్నారు. మండలంలో కొన్ని అనర్హుల పింఛన్లు పరిశీలిస్తే... వెస్టు నరసాపురం సచివాలయంలో ఐడీ నంబర్ల 11200161312, 11200140119, 11200190030, 112001568 25, 11200067006, 11002001332644, 112977099, 11200207862, 1121124587, 112905318, 11200035417, 1120020060 4, 11200190900, 11200084091, 112001 85186, నాయనవారిపల్లిలో 11200137545, 11200137547, 11200176385, 11200188 433, 11200190517, 11200205137, సలకంచెరువులో 11200004143, 11200070912, 11200085988, 11200098200, 11200098202, 11200126913, 11200158984, 11200198367లు అర్హత లేకపోయినా పింఛన్లు పొందుతున్నారు. ఇలా మండలంలో చాలా గ్రామాల్లో అర్హతలేని వారు పింఛన్లు పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వారు సుమారు 600మందికి పైగా ఉన్నట్లు సమాచారం.



సర్టిఫికెట్ కావాలంటే రూ.వేలు చెల్లించాల్సిందే..!

వైసీపీ పాలనలో అర్హత లేనివారికి సైతం సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తామని చెప్పి కొందరు నాయకులు, వలంటీర్లు రూ.20 వేలు వసూలు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ సొమ్ము పెరగడంతో ఇప్పటి నాయకులు రూ.35వేలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. శింగనమల ఆసుపత్రిలో గతంలో సదరం క్యాంపు డాక్టర్‌గా పని చేసిన మెడికల్ ఆఫీసర్ కొందరు వైసీపీ నాయకులతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా సర్టిఫికెట్లు జారీ చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆ డాక్టర్‌పై విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఫిర్యాదు చేస్తే విచారిస్తాం..

మండలంలో దివ్యాంగుల బోగస్ పింఛన్లపై ఎక్కడ ఫిర్యాదులు రాలేదు. ప్రభుత్వం నుంచి పింఛన్ల తనిఖీలు చేయమని ఆదేశాలు రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నోటీస్ జారీ చేసి వైద్యుల చేత విచారణ చేసి అర్హతలేకపోతే తొలగిస్తాం..

-నిర్మలాకుమారి, ఎంపీడీఓ





ప్రగతి బాట

అమరావతిలో బుధవారం జరిగిన కలెక్టర్ల సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లాకు చెందిన మంత్రులు సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, సవిత. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి భోజనం చేస్తున్న అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ వి.రత్న ఇతర ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు. రెండో రోజు ఉమ్మడి జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై సమగ్ర సమీక్ష ఉంటుంది.

ఉపాధిలో అగ్రస్థానమే లక్ష్యం

■ డ్వామా పీడీ సలీంబాషా





అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యమని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. ఉపాధి పథకం కింద చేపడుతున్న పనులు, జిల్లాలో పురోగతి అంశాలపై డ్వామా పీడీ వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి...?
పీడీ: జిల్లాలో 3.08లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 5.66లక్షల మంది కూలీలు ఉన్నారు. ఎస్సీలకు సంబంధించి 1.26లక్షలు, ఎస్టీ 10,150 జాబ్‌కార్డులు ఉండగా, దివ్యాంగులకు 3826 జాబ్‌కార్డులు ఉన్నాయి.

ప్రశ్న: జిల్లాకు ఈ ఏడాది ఎన్ని పనిదినాలు కేటాయించారు..?
పీడీ: జిల్లాకు 95లక్షల పనిదినాలు కేటాయించారు. ఇప్పటి వరకు 86లక్షల పనిదినాలు పూర్తి చేశాం. రూ.226కోట్లు ఉపాధి కూలీలకు, రూ.104కోట్లు మెటీరియల్ కింద చెల్లించాం.

ప్రశ్న: ఉపాధి కింద ఏయే పనులు చేపడుతున్నారు...?
పీడీ: ఈ ఏడాదిలో పాడి రైతులకు షెడ్ల నిర్మాణం, ఇంకుడుగుంతలు తవ్వడం, ఫారంపాండ్ల నిర్మాణం, సీసీ రోడ్లు వేయడం, డ్రైల్యాండ్ హార్టికల్చర్, పశుగ్రాస క్షేత్రాలు, పల్లె వనాలు, అటవీకరణ, తోపుల పెంపకం చేపడుతున్నాం.

ప్రశ్న: జిల్లాలో డ్రైల్యాండ్ హార్టికల్చర్ పరిస్థితి ఏంటి..?
పీడీ: ప్రధానంగా డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద మొక్కలకు ధరలు పెంచారు. 7500ఎకరాల లక్ష్యానికి గాను 9094ఎకరాలకు మొక్కలు అందజేశాం. రాష్ట్రంలోనే జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. మొక్కల పెంపకం, నీటి నిర్వహణకు లబ్ధిదారులైన రైతులకు ప్రభుత్వమే బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమచేస్తుంది.

ప్రశ్న: ఫారంపాండ్ల నిర్మాణం ఎలా ఉంది...?
పీడీ: ఫారంపాండ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉంది. జిల్లాకు 515సేద్యపు నీటికుంటలు కేటాయించగా...ఇప్పటి వరకు 440పూర్తి చేశాం. వీటితో పాటు ఇంకుడు గుంతల నిర్మాణంలో 283కి గాను 180పూర్తి చేశాం. ఇంకుడు గుంతల నిర్మాణంలో 209కి గాను 203పూర్తి చేశాం.

ప్రశ్న: పశువుల షెడ్ల నిర్మాణం పురోగతి ఎలా ఉంది...?
పీడీ: ఈ ఏడాదిలో కొత్తగా పశువులు, గొర్రెలు, మేకల పెంపకానికి సంబంధించి షెడ్ల నిర్మాణం ప్రారంభించారు. ఇందులో 1475కి గాను 113పూర్తి కాగా మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి. త్వరలో మిగిలినవి కూడా పూర్తి చేసి పాడి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

ప్రశ్న: జిల్లాలో వాటర్‌షెడ్ పరిస్థితి ఎలా ఉంది...?
పీడీ: జిల్లాలో వాటర్‌షెడ్ పనులు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే జరుగుతున్నాయి. గోళ్ళ, శింగనమల, రాప్తాడు హంపాపురంలో జరుగుతున్నాయి. తాజాగా రాప్తాడు మండలం హంపాపురం వాటర్‌షెడ్‌కు జాతీయ స్థాయిలో అవార్డు రావడం జిల్లాకు ఎంతో పేరు తీసుకు వచ్చింది. ఇదే స్ఫూర్తితో వాటర్‌షెడ్ పనులు మరింత నాణ్యతగా చేపడుతాం.



ఉపాధి కూలీలు

సంఘం.. శరణం..!

7 ఏళ్లుగా అడహక్ కమిటీ






సిబ్బంది సమస్యలు పట్టని నేతలు
ఒత్తిళ్లకు బలవుతున్న కిందిస్థాయి ఖాకీలు
పోలీసు అధికారుల సంఘం తీరుపై విమర్శలు

● 'ఒక పని చేసిపెట్టు..' అని అనంతపురం స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఓ హెడ్‌కానిస్టేబుల్‌పై ఆ విభాగం పై అధికారి నాలుగు నెలల క్రితం తీవ్ర ఒత్తిడి చేశారు. భరించలేక ఆ హెడ్‌కానిస్టేబుల్ సెలవు పెట్టి వెళ్లారు.

● సరెండర్ లీవులు, బకాయిలు ఇవ్వాలని కోరుతూ ఏఆర్ విభాగం కానిస్టేబుల్ ప్రకాష్ ఏడాదిన్నర క్రితం డిమాండ్ చేశారు. అప్పటి సీఎం జగన్ జిల్లాకు వచ్చిన సందర్భంలో ప్లకార్డు పట్టుకుని పోలీసు అమరవీరుల స్తూపం ఎదుట బైఠాయించారు. అప్పటి నుంచి అతని మీద యుద్ధం ప్రకటించారు. ఉన్నతాధికారులు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించారు. కేసులు పెట్టి వేధించారు. చివరకు డిస్మిస్ చేశారు.



పోలీస్ అమరవీరుల స్తూపం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రకాష్ (ఫైల్)

అనంతపురం క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇబ్బందులు ఎదుర్కొనే ఉద్యోగులకు వారి సంఘాలు అండగా నిలుస్తాయి. న్యాయం జరిగేలా చూస్తాయి. కానీ పోలీసు అధికారులు సంఘం మాత్రం ఇలాంటి పనిచేయదని బాధితులు వాపోతుంటారు. సెలవులో వెళ్లిన హెడ్ కానిస్టేబుల్‌కు, డిస్మిస్ అయిన ఏఆర్ కానిస్టేబుల్‌కు అండగా నిలవకపోవడం ఇందుకు నిదర్శనం. జిల్లాలో చాలామంది బాధితులు ఉన్నారు. ఎస్ఐ, సీఐ, డీఎస్పీ స్థాయి అధికారుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. సంఘం వారి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఎవరి కోసం..?

జిల్లా పోలీసు అధికారుల సంఘం ఆ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. కానీ ఉన్నతాధికారుల సేవకే పరిమితమౌతోందని విమర్శలు ఉన్నాయి. హోం గార్డు మొదలు ఏఎస్ఐ స్థాయివారి గురించి సంఘం అస్సలు పట్టించుకోదనే ఆరోపణలు చాలా సంవత్సరాలుగా ఉన్నాయి. ఏదో నోటిమాటతో అయిపోయే విషయాలపై మాత్రమే, అదీ కొందరికోసమే స్పందిస్తారని బాధితులు అంటున్నారు. అధికారుల ఒత్తిళ్లు, ఇతరత్రా సమస్యలు ఉంటే.. ఆ సమస్య ఎవరిదైనా పట్టించుకోరని వాపోతున్నారు. పోలీసు అధికారుల సంఘం నేతల స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందిలాగే వ్యవహరిస్తారు. యూనిఫాం వేసుకోవడం వారికి చికాకు అన్నట్లు ప్రవర్తిస్తారు. డీజీపీ వచ్చినప్పుడో, కొత్తగా ఎస్పీ బాధ్యతలు తీసుకునే సమయంలోనో మినహా.. వారి ఒంటిపై ఖాకీ దుస్తులు కనిపించవు. పోలీసు సిబ్బంది మృతి చెందిన సమయంలో పోలీసు లాంఛనాలతో వారి అంత్యక్రియలు నిర్వహిస్తారు. అక్కడ కూడా వీరు యూనిఫాంలో కనిపించరు.

సత్కరించడమే పనా..?

ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేయడం, చిన్న పని చేస్తే సత్కరించడమే సంఘం విధి అన్నట్లుగా తయారైంది. వైసీపీ హయాంలో పోలీసులకు డీఏ, సరెండర్ లీవులు తదితర సమస్యల గురించి సంఘం పట్టించుకున్న దాఖలాలు లేవు. వైసీపీ అధికారంలోకి రాకముందు పోలీసులకు వీక్లీ ఆఫ్‌లు అని ఆ పార్టీ అధినేత ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక కొన్ని నెలలు మాత్రమే అమలు చేసి.. అటకెక్కించారు. దీని గురించి కూడా ప్రశ్నించలేదు. కనీసం వినతిపత్రం ఇవ్వలేదు. ప్రశ్నించేవారికి పోలీసు అధికారుల సంఘంలో చోటు ఉండదనే ప్రచారం ఉంది. అందుకే హోదా ఉంటే చాలు.. సమస్యల గురించి ప్రస్తావించి ఇబ్బంది పడటం ఎందుకని మిన్నకుండిపోతున్నారని ప్రచారం ఉంది. ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాష్‌ను శాఖ పరంగా తీవ్ర ఇబ్బందులు పెట్టారు. రుజువులు లేని కేసులో ఇరికించి డిస్మిస్ చేశారు. అందరి సమస్యలపై గళం విప్పినందుకు ఉద్యోగాన్ని పోగొట్టుకున్నాడు. అతనిపట్ల కనీస సానుభూతి చూపించలేదు. కాపాడే ప్రయత్నం అస్సలు చేయలేదు. సంఘం జోక్యం చేసుకుని ఉంటే.. ప్రకాష్‌కు ఆ పరిస్థితి ఎదురయ్యేదా..?



హెడ్‌కానిస్టేబుల్ అంత్యక్రియల్లో యూనిఫాం లేకుండా నిల్చున్న పోలీస్ అధికారుల సంఘం నాయకులు(ఫైల్)

ఏడేళ్లుగా అడహక్ కమిటీ

పోలీస్ అధికారుల సంఘం పేరుతో ఒకే కమిటీ ఏడేళ్లుగా నడుస్తోంది. ఒకే కమిటీ ఇన్నేళ్లు కొనసాగడం విమర్శలకు తావిస్తోంది. తనకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వకపోవడంపై పోలీస్ అధికారుల సంఘం మాజీ అధ్యక్షుడు శివానంద ఏడేళ్ల క్రితం కోర్టును ఆశ్రయించారు. దీంతో ఎన్నికలపై కోర్టు స్టే విధించింది. అప్పటి నుంచి పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీతోనే నడుస్తోంది. తాత్కాలిక కమిటీని ఏడేళ్లుగా, ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగించడం ఏమిటని పోలీసు శాఖ అధికారులు, సిబ్బందే ప్రశ్నిస్తున్నారు. కొత్త కమిటీ ఎన్నికైతే కొంతైనా మార్పు ఉంటుందని వారు అంటున్నారు. పోటీ ఉంటే పోలీస్ సిబ్బంది సమస్యలపై పోరాడే నాయకత్వం వస్తుందని అంటున్నారు. అండగా నిలబడే సంఘం కోసం పోలీసు బాధితులు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ బియ్యాన్ని అమ్ముకోరాదు

ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి



రాప్తాడు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనం రుచి చూస్తున్న విజయ్ ప్రతాప్‌రెడ్డి

రాప్తాడు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఉచిత బియ్యాన్ని అమ్ముకోరాదని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని కేజీబీవీ, రాప్తాడు ఉన్నత పాఠశాల, గంగలకుంట అంగన్‌వాడీ కేంద్రం, రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాలు కిలో రూ. 45 ప్రకారం రైతుల నుంచి కొనుగోలు చేసి రాష్ట్రంలోని దాదాపు 4 కోట్ల మంది ప్రజలకు బియ్యం అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వం అందించే బియ్యాన్ని ప్రజలు చులకనగా చూస్తూ కిలో రూ. 13కే అమ్ముకుంటున్నారన్నారు. ప్రభుత్వం అందించే బియ్యం ఎంతో నాణ్యతగా ఉంటాయని, మంచి విటమిన్లు ఉంటాయన్నారు. ఆ బియ్యం అమ్ముకోకుండా రాగిముద్ద, పిండి వంటలు, దోసెలు, వడియాలు, టిఫిన్‌లకు ఉపయోగించుకోవాలన్నారు. ప్రజలు అమ్మిన బియ్యాన్ని వ్యాపారస్థులు సన్న బియ్యంగా మార్చి విదేశాలకు విక్రయిస్తున్నారన్నారు. ఆ సన్న బియ్యం తిరిగి ప్రజలు రూ. 60 కొంటున్నారన్నారు. కేజీబీవీలో మధ్యాహ్న భోజనం బాగుందని తెలిపారు. గంగలకుంట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. రాప్తాడు ఉన్నత పాఠశాలలో కూర నీళ్లగా ఉందని భోజన నిర్వాహకులను మందలించారు. కార్యక్రమంలో జీసీడీఓ వాణిదేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ ధనలక్ష్మి, డీఈఓ ప్రసాద్‌బాబు, డీఎస్ఓ రమేష్ బాబు, ఎంఈఓ మల్లికార్జున, హెచ్ఎం సాంబశివ, ఎస్ఓ ముత్యాలమ్మ, డాక్టర్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.1000కి ఏమొస్తుంది..?

డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్ సమస్య

మార్కెట్‌లో కొనడానికి నగదు అందజేత ?
రూ.వెయ్యి ఇచ్చేందుకు నిర్ణయం
బయటి మార్కెట్లో ధర రూ.2వేల పైమాటే
ఆందోళనలో అభ్యర్థులు



అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర అధికారులు అనాలోచిత నిర్ణయాలతో డీఎస్సీ ఉచిత శిక్షణ సక్రమంగా అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శిక్షణ సమయంలో అభ్యర్థులకు అందించే స్టైఫండ్, మెటీరియల్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నారు. డీఎస్సీ మెటీరియల్‌కు సంబంధించి బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలు పట్టించుకోకుండా కేవలం రూ.1000 అని నిర్ణయించేశారు. శిక్షణ అందించే ఫ్యాకల్టీ పారితోషికం విషయంలోనూ అదే నిర్లక్ష్యాన్ని వహించారు. వారికి సెషన్‌కి కేవలం రూ.600 అని చెప్పి ఆదేశాలు జారీ చేశారు. దీంతో అభ్యర్థులు, ఫ్యాకల్టీ సిబ్బంది ఇబ్బంది ఇబ్బంది పడుతున్నారు.



మెటీరియల్‌కు బదులు డబ్బు

గతంలో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందించే డీఎస్సీ ఉచిత శిక్షణకు సంబంధించి ఆ శాఖాధికారులే స్టడీ మెటీరియల్‌ను అందించేవారు. అభ్యర్థులు ఆ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకునేవారు. వీటికి తోడు స్టైఫండ్ సైతం అందించేవారు. ఈసారి మాత్రం ఆ శాఖ రాష్ట్ర అధికారులు అభ్యర్థులకు స్టైఫండ్ నెలకు రూ. 1500 ఇవ్వడం లేదు. అలాగే మెటీరియల్‌కు బదులు నగదును అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఒక్కో అభ్యర్థికి రూ.వెయ్యి చొప్పున అందించనున్నట్లు తెలిపారు. అయితే బహిరంగమార్కెట్లో మెటీరియల్ ధర చాలా ఎక్కువగా ఉంది. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన మెటీరియల్ దాదాపు రూ. 2500 వరకూ ఉంది. ఎస్‌జీటీలకు సంబంధించిన మెటీరియల్ ధర రూ. 3 వేలకుపైమాటే. దీంతో ప్రభుత్వం ఇచ్చే రూ.వెయ్యితో ఏమి కొనుక్కోవాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

ఫ్యాకల్టీకి ఆరు వందలే..

బీసీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ ఇచ్చే ఫ్యాకల్టీకి అందించే పారితోషికంలోనూ కోత పెట్టారు. సెషన్‌కు రూ. 600లు మాత్రమే ఇస్తున్నారు. బయటి కోచింగ్ సెంటర్లలో సెషన్‌కు రూ. 2వేలు, రూ. 3వేలు ఇస్తున్నారు. దీంతో ఇక్కడ కోచింగ్ ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో నిపుణులైన ఫ్యాకల్టీని పిలుచుకుని వచ్చేందుకు బీసీ స్టడీ సర్కిల్ అధికారులు నానా తంటాలు పడుతున్నారు. బలవంతంగా ముగ్గురు, నలుగురు ఫ్యాకల్టీలతో నెట్టుకొస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గైడ్‌లైన్స్ మేరకే...

రాష్ట్ర అధికారులు ఇచ్చిన మార్గదర్శకాల మేరకే ఉచిత డీఎస్సీ శిక్షణను అమలు చేస్తున్నాం. మెటీరియల్‌కు సంబంధించిన మొత్తాన్ని అభ్యర్థుల ఖాతాలకు జమ చేసేలా రాష్ట్ర అధికారులు నిర్ణయించారు. అభ్యర్థులకు మేము మెటీరియల్ ఇవ్వడం లేదు. రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకే స్టైఫండ్‌తో పాటు మెటీరియల్‌కు సంబంధించిన రూ. వెయ్యి ఖాతాలకు జమవుతుంది.

- కుష్బూ కొఠారీ, డైరెక్టర్, బీసీ స్టడీసర్కిల్

వదాన్య డీఎస్సీ హాల్ టిక్కెట్లు విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే డీఎస్సీ ఎస్‌జీటీ మెగా గ్రాండ్ టెస్ట్‌కు సంబంధించిన హాల్ టిక్కెట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు ఆ సొసైటీ ఫౌండర్ అశోక్ వడపాటి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచే హాల్‌టిక్కెట్లు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2110 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. డిసెంబరు 29న కొత్తచెరువులో పరీక్ష నిర్వహిస్తామన్నారు. హాల్‌టిక్కెట్ల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన మొదటి 50 మందికి నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు.

బేడ బుడగ జంగాల సమస్యలు పరిష్కరించండి

కేంద్ర ప్రభుత్వం సోషల్ జస్టిస్ సెక్రటరీకి ఎంపీ వినతి

అనంతపురం అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సోషల్ జస్టిస్ సెక్రెటరీ అమిత్ యాదవ్‌ను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఢిల్లీలో బుధవారం ఆయన బేడ, బుడగ సంఘాల నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. 16 సంవత్సరాలుగా ఎలాంటి కుల ధ్రువీకరణ పత్రం పొందకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటున్న బేడ, బుడగ కులస్థులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. బేడ, బుడగ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసేందుకు 2017లో సీఎం చంద్రబాబునాయుడు జేసీ శర్మ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ అన్ని జిల్లాలో పర్యటించి 2018లో నివేదికలు సమర్పించిందన్నారు. 2019లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఆ నివేదికలు పంపిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని బేడ, బుడగ కులస్థులకు ఎస్సీ సర్టిఫికెట్లు అందేలా చూడటంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.



కేంద్ర ప్రభుత్వం సోషల్ జస్టిస్ సెక్రటరీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా అంతేనా..?

ఏపీఓ నాగరాజుపై చర్యలేవీ..?

తేలిగ్గా తీసుకున్న విద్యాశాఖ అధికారులు
ఏఎస్ఓ పోస్టు కట్టబెట్టే యత్నం



అనంతపురం విద్య, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఇష్టారాజ్యం నడుస్తోంది. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ అధికార పార్టీ ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైసీపీ పాలనలో జిల్లా విద్యాశాఖలోకి ఏపీఓగా వచ్చిన నాగరాజుపై గతంలో ఉపాధ్యాయుల నుంచి అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు పలు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన విషయాన్ని ఆరాతీసి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సెప్టెంబరు నెలలో లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. 'ఏపీఓ నాగరాజు ఉపాధ్యాయుల సర్దుబాటులో మిగులు ఉపాధ్యాయులకు మంచి స్థానాలు కావాలంటే నన్ను కలవండి. మంచి ప్లేస్ ఇప్పిస్తానంటూ టీచర్ల నుంచి కొంత మొత్తం తీసుకున్నట్లు తన దృష్టికి వచ్చింది' అని ఫిర్యాదులో ఎమ్మెల్యే పేర్కొన్నారు. టీచర్లు అదే స్కూల్‌లో కొనసాగాలన్నా కూడా తనను సంప్రదిస్తే చాలు అంటూ ఏపీఓ మోసం చేస్తున్నారంటూ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే రెండు మాసాలు కిందటే అధికార పార్టీ ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా...ఇప్పటి వరకూ ఏపీఓపై జిల్లా విద్యాశాఖాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

కమిషనర్ చెప్పినా.. కదిలించరా...?

వైసీపీ పాలనలో నాగరాజు ఏపీఓగా డీఈఓ ఆఫీస్‌కు వచ్చారు. గత ప్రభుత్వంలో వచ్చిన ఉపాధ్యాయులను కదిలించి కొత్త వాళ్లను తీసుకోవాలంటూ విద్యాశాఖ కమిషనర్ అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఇదే విషయాన్ని ఇటీవల కూడా కమిషనర్ డీఈఓలను ఆదేశించారు. ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా, విద్యాశాఖ కమిషనర్ చెప్పినా జిల్లా విద్యాశాఖాధికారులు పెడ చెవిన పెట్టడం అనేక విమర్శలకు తావిస్తోంది. ఏపీఓగా పనిచేస్తున్న ఆయనను కీలకమైన అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) పోస్టులో కూర్చోబెట్టాలని కొందరు గట్టిగా పైరవీలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆ దిశగా ఫైల్‌ను కదిలిస్తున్నట్లు సమాచారం.



శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్ మీదుగా శబరిమలకు సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు-కొల్లాం ప్రత్యేక రైలు (నం. 07181) జనవరి 4, 11, 18 తేదీల్లో రాత్రి 11-45 గంటలకు గుంటూరులో బయలుదేరి 6, 13, 20 తేదీల్లో ఉదయం 6-20 గంటలకు కొల్లాంకు చేరుకుంటుందన్నారు. అలాగే కొల్లాం-గుంటూరు ప్రత్యేక రైలు (నం. 07185) జనవరి 13, 20 తేదీల్లో ఉదయం 10-45 గంటలకు కొల్లాంలో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 4 గంటలకు గుంటూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైళ్లు నరసరావుపేట, దొనకొండ, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, దిగువమిట్ట, నంద్యాల, బేతంచెర్ల, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పట్టి, సేలం, ఈరోడ్, తిరుప్పూరు, పొదనూరు, పలక్కడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం టౌన్, ఎట్టుమనూర్, కొట్టాయం, తిరువల్ల, చెంగనూరు, కాయంకుళం స్టేషన్ల మీదుగా వెళ్తాయన్నారు. కొల్లాం-కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు (నం. 07182) జనవరి 2న ఉదయం 10-45 గంటలకు కొల్లాంలో బయలుదేరి మరుసటిరోజు రాత్రి 10 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు కాయంకుళం, చెంగనూరు, తిరువల్ల, కొట్టాయం, ఎట్టుచలయోర్, ఎర్నాకులం టౌన్, అలువ, త్రిసూర్, పలక్కడ్, పొదనూరు, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పట్టి, కాట్పాడి, చిత్తూరు, పాకాల, పీలేరు, మదనపల్లి, కదిరి, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, బేతంచెర్ల, నంద్యాల, దిగువమెట్ట, గిద్దలూరు, మార్కాపురం రోడ్డు, దొనకొండ, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

వైద్యులు.. సిబ్బందికి మెమో



రోగితో మాట్లాడుతున్న డీసీహెచ్ డాక్టర్ రవికుమార్

శింగనమల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ విధులకు గైర్హాజరైన ఐదుగురు వైద్యులు, నలుగురు వైద్య సిబ్బందికి డీసీహెచ్ డాక్టర్ పాల్ రవికుమార్ మెమో జారీ చేశారు. సీహెచ్‌సీని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఆసుపత్రిని పరిశీలించారు. ఔషధాల కొరత, సిబ్బంది పని తీరు గురించి విచారించారు. ఆస్పత్రిలో 24 గంటలు సేవలు అందించాలని, కానీ వైద్యులు, సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని అన్నారు. రాత్రి సమయంలో వైద్యులు విధులకు సరిగా హాజరు కావడం లేదని అనానరు. రోగుల పట్ల వైద్య సిబ్బంది అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

న్యూస్‌బాక్స్

827 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 827 క్యూసెక్కుల వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్-2కు 891 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.672 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.16

అనంతపురం రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.16తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం మార్కెట్‌కు 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.12, కనిష్ఠ ధర రూ.7పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.38వేలు

అనంతపురంరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.38,290, కనిష్ఠంగా రూ.13 వేలు, సరాసరి రూ.30వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 42టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

అరుణాచలం వెళ్లే భక్తులకు పోలీసుల సూచన

అనంతపురం క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై అరుణాచలేశ్వర దేవాలయంలో ఈ నెల 13న మహాదీపం, గిరి ప్రదక్షిణ(గిరివలం)కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మన రాష్ట్రం నుంచి వెళ్లే భక్తుల కోసం తిరువణ్ణామలై పోలీసులు కొన్ని సూచనలు చేశారు. తిరుపతి, చిత్తూరు రహదారుల నుంచి వెళ్లే ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల కోసం వెల్లూరు రోడ్డులోని తాయి ముగాంబికా నగర్, తిరువణ్ణామలై బైపాస్ రోడ్డు సమీపంలో ఏకేఎస్ నగర్‌లలో 2 తాత్కాలిక బస్టాండు, వెల్లూరు రోడ్డులో 13 తాత్కాలిక కారు పార్కింగ్‌లను ఏర్పాటు చేశారు. 9363622330 నెంబర్ ద్వారా హలో అని పంపితే రూట్ మ్యాప్ లింక్స్ పంపుతామని తిరువణ్ణామలై జిల్లా పోలీస్‌లు ప్రకటించారు. రోడ్డు పక్కన వాహనాలు పార్కింగ్ చేయరాదని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదమని అనిపిస్తే సమీపంలోని ఉన్న పోలీసులకు తెలియజేయవచ్చన్నారు. భక్తులకు వైద్యపరంగా సహాయం అందించడానికి ప్రత్యేకంగా ఈనెల 12 ఉదయం 7గంటల నుంచి 15 సాయంత్రం ఆరుగంటల వరకు అందుబాటులో ఉన్న మే ఐ హెల్ప్ యూ బూత్‌లోని పోలీసులను సంప్రదించవచ్చు.

నీటి సంఘాలకు ఎన్నికలు

14న పోలింగ్

ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



హెచ్చెల్సీ

అనంతపురం క్లాక్‌టవర్/పుట్టపర్తి టౌన్/కదిరి అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నిలకు ఎట్టకేలకు షెడ్యూల్ ప్రకటించారు. హెచ్చెల్సీ పరిధిలో 99, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 మొత్తం 194సాగునీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఎన్నికలను ఈ సారి కచ్చితంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. ఈనెల 14న సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేయాలని తాజాగా కొత్త షెడ్యూల్ విడుదల చేశారు. అదే రోజు ఎన్నికల అనంతరం సర్వసభ్యసమావేశాలు నిర్వహించనున్నారు. 17న జిల్లాలోని హెచ్‌ఎల్‌ఎంసీ, మిడ్ పెన్నార్ సౌత్‌కెనాల్, మిడ్ పెన్నార్ నార్త్ కెనాల్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్, గుంతకల్లు బ్రాంచ్‌కెనాల్, ఆలూరు బ్రాంచ్ కెనాల్‌తో పాటు డిస్ట్రిబ్యూటరీల కమిటీలను ఎన్నుకుంటారు. అలాగే తుంగభద్ర, భైరవానితిప్ప ప్రాజెక్ట్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల కమిటీలను ఎన్నుకోనున్నారు.

194 సంఘాలకు ఎన్నికలు

జిల్లాలో మొత్తం 194సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. తుంగభద్ర ప్రాజెక్ట్ ఎగువ కాలవ (టీబీపీ హెచ్చెల్సీ) పరిధిలో 99సాగునీటి సంఘాలను గుర్తించారు. ఇందులో హెచ్‌ఎల్‌ఎంసీ 11 సాగునీటి సంఘాలకు 35,541ఎకరాల ఆయకట్టు ఉంది. మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ ఐదు సంఘాలకు 13,325 ఎకరాలు, మిడ్ పెన్నార్ సౌత్ కెనాల్‌కు 10సంఘాలకు 29,577ఎకరాల ఆయకట్టు ఉంది. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ కింద 9 సంఘాల కింద 25,478ఎకరాల ఆయకట్టు ఉంది. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 11సంఘాల కింద 32,072 ఎకరాలు, కర్నూలు జిల్లాలోని ఆలూరు బ్రాంచ్ కెనాల్ 14,255ఎకరాల ఆయకట్టుకు ఆరు సంఘాలు ఉన్నాయి. కడప జిల్లాలోని జమ్మలమడుగు 10సంఘాలకు 22,625ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రొద్దుటూరు 10 సంఘాలకు 24,524ఎకరాలు ఉంది. ఎర్రగుంట్ల 9సంఘాలకు 23,392 ఎకరాలు, కసనూరు 5సంఘాలకు 8,843ఎకరాలు, సింహాద్రిపురం 8సంఘాలకు 24,670ఎకరాలు, ఆచ్చవల్లి 5సంఘాలకు 16,507ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తం హెచ్చెల్సీ కింద 99సాగునీటి సంఘాల పరిధిలో 2,70,809 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో అనంతపురం జిల్లాలో 5డిస్ట్రిబ్యూటరీ సంఘాల పరిధిలో 46సాగునీటి సంఘాలు, కర్నూలు ఒక డిస్ట్రిబ్యూటరీ కింద 6సాగునీటి సంఘాలు, కడపలో 6డిస్ట్రిబ్యూటరీలు కింద 47సాగునీటి సంఘాలు ఉన్నాయి. మొత్తం హెచ్చెల్సీ పరిధిలో 12డిస్ట్రిబ్యూటరీల కింద 99సాగునీటి సంఘాలను గుర్తించారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలో జిల్లాలో 95సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటిలో మేజర్ ప్రాజెక్ట్‌గా భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్ట్ కింద 6 చెరువులు 89 సాగునీటి సంఘాలు ఉన్నాయి.

ఒక్కో అసోసియేషన్‌కు 20-50 ఎకరాల ఆయకట్టు రైతులు ఓటర్లుగా టీసీని ఎన్నుకుంటారు. టీసీ (టెరిటోరియల్ కాన్‌స్టెన్సీ)లు కనీసం 6-12 మంది కలిసి వాటర్ యూజర్ అసోసియేషన్‌లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు.

శ్రీసత్యసాయి జిల్లాలో...


శ్రీసత్యసాయి జిల్లాలో 216 మైనర్‌ఇరిగేషన్ చెరువులు, 16 మధ్యతరహా ప్రాజెక్టులున్నాయి. మొత్తం 230 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలో అన్ని చెరువులకు కలిసి 77,454మంది ఓటర్లు ఉండగా, 1,476 మంది ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులు ఎన్నిక కానున్నారు. మైనర్ ఇరిగేషన్ చెరువు, సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఆరు గురు ప్రాదేశిక నీటిసంఘల సభ్యులను ఎన్నుకుంటారు. వారిలో ఒకరిని అధ్యక్షులు, మరొకరిని ఉపాధ్యక్షులుగా ఎన్నుకుంటారు. అలాగే మధ్యతరహా ప్రాజెక్టుల్లో 12మంది ప్రాదేశ నియోజకవర్గ సభ్యులుంటారు. వీరిలోనే అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు.

కూటమిలో పోటాపోటీ, వైసీపీలో నైరాశ్యం

జిల్లా వ్యాప్తంగా ఈనెల 14న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయడానికి టీడీపీ కూటమి నేతల్లో తీవ్ర పోటీ నెలకొంది. సార్వత్రిక ఎన్నికల తరువాత మొదటిసారి వస్తున్న ఎన్నికలు కావడంతో సాగునీటి సంఘాల అధ్యక్షులు కావడానికి కూటమి నేతలు పోటీ పడుతున్నారు. జిల్లాలోని అన్ని సాగునీటి అధ్యక్ష స్థానాలను ప్రాదేశిక నియోజకవర్గ స్థానాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకోడానికి కూటమి నేతలు వ్యూహాలు పన్నుతున్నారు. కాగా సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమితో వైసీపీ నాయకులు సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయడానికి జంకుతున్నారు. ఒకటి రెండుచోట్ల పోటీచేయాలని కిందిస్థాయి కార్యకర్తలు, సానుభూతి పరులు ఉత్సహంగా ఉన్నా, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండలస్థాయి నాయకులు మనకెందులే అన్న ధోరణిలో ఉన్నారు.

తొమ్మిదేళ్ల అనంతరం..

వివిధ కారణాలతో రెండు సార్లు వాయిదా పడిన సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో గ్రామాలలో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు జాబితాలను విడుదల చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నికలు జరపకపోవడంతో పూడిక తీత పనులు, మరమతులు, కాలువ గట్ల బలోపేతం వంటి క్షేత్రస్థాయి ముఖ్యమైన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇప్పుడు సాగునీటి సంఘాలకు టీడీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం అయ్యింది. 2015 అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ సంఘాలకు నామినేషన్ పద్ధతిలో చైర్మన్లను నియమించిన విషయం తెలిసిందే. వారి పదవీ కాలం పూర్తయిన తర్వాత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించ లేదు. ఇరిగేషన్ అధికారులతోనే పనులు చక్కబెట్టింది. దీంతో నిర్వహణ గాడి తప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నీటి సంఘాల పాధాన్యతను గుర్తించి, ఎన్నికల నిర్వహణకు ఆదేశాలిచ్చింది.



నిండుకుండలా బుక్కపట్నం చెరువు

అక్రమాలకు అడ్డుకట్ట

చెరువుల్లో అక్రమంగా మట్టి తోలకపు నియంత్రణనకు సాగునీటి సంఘాలు దోహదపడతాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే సాగునీటి అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించేవిధంగా సంఘాలు పర్యవేక్షిస్తాయి.

-నాగరాజు, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, పట్నం

పకడ్బందీగా ఏర్పాట్లు

ఈనెల 14న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే మైనర్ ఇరిగేషన్ చెరువులకు చెందిన ఓటర్ల జాబితాను సిద్ధం చేశాం. రైతుల అభిప్రాయాల మేరకు అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాల ఎన్నిక నిష్పక్షపాతంగా నిర్వహిస్తాం. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేశాం.

- రాధాకృష్ణ, ఇరిగేషన్ ఈఈ

మత సామరస్యానికి ప్రతీక బాబయ్య దర్గా


13న గంధం మహోత్సవం

సర్వమత సమ్మేళనానికి హాజరుకానున్న ప్రముఖులు

పెనుకొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబయ్యస్వామి దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. హిందూముస్లింల ఐక్యతకు చిహ్నం. దక్షిణ భారతదేశంలోనే పరమ పవిత్రమైన దర్గాల్లో ఇదొకటి. ఏటా బాబయ్య స్వామి ఉరుసు నిర్వహిస్తారు. విదేశాల నుంచి సైతం భక్తులు తరలివస్తారు. తాజాగా స్వామి వారి 752వ ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో ప్రధానమైన గంధపు పూజ మహోత్సవం ఈనెల 13న ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా తెలిపారు. 14న దీపారాధన, 15న ఫకీర్ల ప్రదర్శన, 16న ధూళిపరుష, 17న ఖాజా సయ్యద్‌షా మస్తాన్ హుసేన్ గంధం పూజ, 18న సయ్యద్ బీదర్‌షావలి గంధంపూజ నిర్వహిస్తారు. 19న అర్మాన్, ఫకీర్లు ఇతర ఉరుసులకు వెళ్లిపోతారు. గంధంపూజ రాత్రి ఖవాలీ మందిరం సమీపంలో రాత్రి 9గంటల నుంచి ఇంటిగ్రేటెడ్ నేషనల్ సెమినార్ (సర్వమత సమ్మేళనం) నిర్వహిస్తారు. ప్రభుత్వం తరఫున బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత చాదర్ సమర్పిస్తారు. ముఖ్య అతిథులుగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫారూక్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ మహ్మద్ అహ్మద్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, రాష్ట్ర ముతవల్లీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు షకీల్ షఫీ, కలెక్టర్ చేతన్, కర్నూలు రేంజ్ ఏఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ హాజరవుతారన్నారు.

దర్గా చరిత్ర

స్వామి చరిత్రను గ్రంథం రూపంలో లిఖించారు. బాబా ఫకృద్దీన్ జన్మస్థలం ఇరాన్ దేశంలోని శిస్థాన్ పట్టణం. ఈయన చక్రవర్తిగా రాజ్యపాలన చేస్తున్న సమయంలో ఒక రోజు గుర్రపు స్వారీపై తనకున్న వ్యామోహంతో న్యాయం కోసం వచ్చిన బాధితులను నిర్లక్ష్యం చేస్తాడు. చేసిన తప్పునకు పశ్చాత్తాపంతో మత గురువు ఆదేశానుసారం రాజ్యాన్ని త్యజించి, పాప విమోచనం కోసం దేశాటనకు బయలుదేరి వెళ్లాడు. దేశవిదేశాలు తిరిగి భారతదేశం చేరతాడు. తమిళనాడులోని తిరుచనాపల్లికి వస్తారు. అక్కడ హజ్రత్ సత్తేహార్ తబ్రే ఆలం బాద్‌షాను గురువుగా స్వీకరిస్తారు. పెనుకొండకు వెళ్లమని గురువుకు ఆదేశించి, అదే తన నివాస స్థలమన్నారు. అక్కడే ఉండి సర్వమానవ సౌభ్రాతృత్వం, శాంతి, సామరస్యం గురించి ప్రజలకు బోధించాలని గురువు ఆదేశిస్తారు. అందుకు బాబా దుఃఖిస్తూ పెనుకొండ ఎక్కడ ఉందో తనకు తెలియదని గురువును వేడుకుంటారు. అందుకు తాను దంతాలు తోముకుంటున్న కట్టిపుల్లను బాబాకు ఇస్తారు. దేశ సంచారం చేస్తూ రాత్రిపూట నిద్రించే స్థలంలో పుల్లను భూమిలో నాటాలనీ, మరుసటిరోజు చిగురిస్తే అదే స్థిర నివాసమని గురువు ఉపదేశిస్తారు. బాబా దేశాటన చేస్తూ కర్ణాటక, తమిళనాడు, పలు ప్రాంతాలు తిరిగారు. చివరకు పెనుకొండకుచేరుకుంటారు. కోట బయట తూర్పున ఆనుకుని ఉన్న మండపంలో బస చేశారు. రాత్రి నిద్రించే సమయం తన వెంట తెచ్చుకున్న పుల్లను భూమిలో నాటి ఉదయం లేచి చూస్తారు. అది చిగురించి ఉండటాన్ని గమనిస్తారు. గురువు నిర్దేశించిన స్థలం ఇదేనని అక్కడే బాబా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. బాబయ్యస్వామి తమ దేవాలయ మండపంలో బాబాఫకృద్దీన్ అనే ముస్లిం ఫకీర్ ఉండటానికి హిందూ మతపెద్దలు జీర్ణించుకోలేకపోయారు. తీవ్రంగా వ్యతిరేకిస్తూ రాజుకు ఫిర్యాదు చేస్తారు. ఇరువర్గాల వాదన విన్న మహారాజు బాబాఫకృద్దీన్‌కు హిందూ మతపెద్దల మధ్య పోటీ నిర్వహిస్తారు. పోటీలో బాబా గెలుపొంది, మండపాన్ని స్థిర నివాసంగా పొందుతారు. ప్రతి రోజూ మతసామరస్యంగా తమ మహిమలను చూపుతారు. దీర్ఘకాలిక రోగాలను నయం చేస్తారు. దీంతో స్వామిని హిందూవులు కూడా కొలిచేవారు. బాబయ్యస్వామిగా ఖ్యాతి పొందిన బాబాఫకృద్దీన్ క్రీ.శ. 694 సంవత్సరంలో పరమపదించారు. ఆ స్థలంలోనే బాబాను సమాధి చేశారు. ప్రస్తుతం ఆయన సమాధే ప్రఖ్యాతి చెందిన బాబయ్య దర్గా. అక్కడే ఏటా ఉరుసు ఉత్సవాలను భారీఎత్తున నిర్వహిస్తారు.



పెనుకొండ బాబయ్య దర్గా ముఖద్వారం



బాబయ్యస్వామి సమాధి

కూలీల ఆటో బోల్తా

ఒకరికి తీవ్రగాయాలు

యల్లనూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిర్రమ్మబావి సమీపంలో బుధవారం తెల్లవారుజామున కూలీలను తీసుకువెళ్తున్న ఆటో బోల్తా పడటంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పుట్లూరు మండలం గోపరాజుపల్లికి చెందిన గోపాల్ మరో పదిమంది కలిసి ఆటోలో కడపజిల్లా బలపనూరుకు తోట చుట్టూ ఫెన్సింగ్ వేసే పనికి బయల్దేరారు. గిర్రమ్మబావి సమీపం లోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణి స్తున్న గోపాల్ తీవ్రంగా గాయపడగా మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటప డ్డారు. క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రైం కార్నర్

బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

పామిడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండూరు రోడ్డు పక్కన ఓ మామిడి తోటలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్, సీఐ జమాల్‌బాషా తెలిపిన మేరకు... రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై నిరుపేదలకు సరఫరా చేస్తున్న బియ్యాన్ని కొందరు అక్రమంగా మామిడి తోటలో నిల్వ చేశారని సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో సుమారు 200 బస్తాల రేషన్ బియ్యంను కనుగొన్నామన్నారు. వెంటనే ఆ బియ్యాన్ని సీజ్ చేసి, సీఎస్‌డీటీ కంబక్కకు అప్పగించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన ఆనంద్(45)బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు ఆనంద్ స్థానికంగా ఓ చికెన్ సెంటర్‌లో పని చేసేవాడు. ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించి కారణాలు ఆరాతీశారు. భార్యతో గత కొంతకాలంగా గొడవలు ఉన్నాయని మృతుడి అన్న ఈశ్వరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మృతిపై భార్యతోపాటు మరో వ్యక్తిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య రాజమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ఆస్పత్రికి తరలించారు.

మద్యం కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

గోరంట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలకుంటపల్లికి చెందిన వెంకటేష్‌కు మద్యం అక్రమ రవాణా కేసులో పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మూడేళ్ల జైలుశిక్ష, రూ.2.01 లక్షల జరిమానా విధించినట్లు సీఐ శేఖర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వెంకటేష్ 2021 నవంబరు 6న కర్ణాటక నుంచి 75 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యంతో పాటు 25 గుట్కా ప్యాకెట్లను తరలిస్తుండగా అప్పటి సీఐ జయనాయక్ అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. 2023లో చార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయాధికారి బొజ్జప్ప.. నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి



ముల్లా అబ్దుల్ సాబ్ (ఫైల్)

యాడికి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడు గ్రామంలో శతాధిక వృద్ధుడు ముల్లా అబ్దుల్ సాబ్ (102) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. ముల్లా అబ్దుల్‌సాబ్ వందేళ్లు దాటినా అలవోకగా తన పనులు తాను చేసుకొనేవాడని, కొలిమి పనితోపాటు కార్పెంటర్ పనికూడా చేసేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రాగిముద్ద, జొన్నసంగటి, సద్దరొట్టెలు, జొన్న రొట్టెలు మొదలగు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వలనే ఇన్నిరోజులు ఆరోగ్యంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ముల్లా అబ్దుల్‌సాబ్‌కు నలుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు సంతానం. 20మందికి పైగా మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు.

కూలీల ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

ఒకరు మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు

కూడేరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రకోడు గ్రామ సమీపాన మలుపు వద్ద ఆటో-ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు... కొర్రకోడు గ్రామానికి చెందిన 14మంది కూలీలు బుధవారం శివరాంపేట వద్ద తోటలో టమోటాలు కోసేందుకు వెళ్లారు. పని ముగిసిన తర్వాత ఉదిరిపికొండ గ్రామానికి చెందిన ఓ ఆటోలో సాయంత్రం ఆరు గంటల సమయంలో స్వగ్రామానికి బయల్దేరారు. కొర్రకోడు గ్రామానికి చెందిన గణేష్ జల్లిపల్లికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. అయితే కొర్రకోడు మలుపు వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కూలీ అనసూయమ్మ(57) మృతిచెందారు. మిగిలిన కూలీలు సంజమ్మ, పద్మావతితో పాటు ద్విచక్ర వాహనదారుడు గణేష్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని ప్రైవేట్ వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం కేసులో ఏడాది జైలు

అనంతపురం క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించిన భర్తకు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. 2015లో వెన్నపూస సౌభాగ్యలక్ష్మికి రాజీవ్‌కాలనీకి చెందిన బ్రహ్మానందరెడ్డితో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.5లక్షలు కట్నంగా ఇచ్చారు. అయితే రూ.10లక్షల అదనపు కట్నం తీసుకురావాలని ఆమెను బ్రహ్మానందరెడ్డి, అతడి తల్లి లక్ష్మీదేవి, తండ్రి ఆదిరెడ్డి, సోదరుడు చెన్నారెడ్డి, సోదరి కృష్ణకుమారి మానసికంగా, శారీరకంగా వేధించారు. ఈ విషయంపై సౌభాగ్యలక్ష్మి 2016 ఫిబ్రవరి 28న త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు వారిని రిమాండ్‌కు పంపడంతో పాటు కోర్టులో చార్జిషీట్ వేశారు. కేసు విచారించిన మొబైల్ కోర్టు న్యాయాధికారి సుజిన్ మొదటి ముద్దాయి బ్రహ్మానందరెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు. మిగిలిన నలుగురిపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టి వేశారు. ఈ కేసును ఏపీపీ శ్రీనివాసులు ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.

సంక్షిప్తం

జాతీయ పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల బృందం

అనంతపురం విద్య, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని తనుశ్రీ ఎంపికైనట్లు కళాశాల జోనల్ ఇన్‌చార్జ్ శివకుమార్, ఏజీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం విద్యార్థినిని వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న తనుశ్రీ అండర్ 17 నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది వెంకట్, కల్పన, రాధాకృష్ణ, జగదీష్, భవాని, రాజేష్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

అనంతపురంరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ దివాకర్ పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు స్థానిక స్వయం సమృద్ధి లక్ష్యాలు అనే అంశంపై మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధికి లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎంపీపీ వరలక్ష్మి, ఈఓఆర్డీ వెంకటనాయుడు హాజరయ్యారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామగిరి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వన్నూరప్ప మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పేరూరులోని ఆర్ఎంపీలు, మెడికల్ షాపు యజమానులు, ల్యాబ్ నిర్వాహకులు కలిసి రూ.40వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. బుధవారం మృతుడి భార్యలక్ష్మీదేవికి అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆయన మృతికి సంతాపంగా క్లినిక్‌లు బంద్ చేశారు.

అనారోగ్యంతో టీడీపీ నాయకుడి మృతి

అనంతపురంరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లికి చెందిన టీడీపీ నాయకుడు బండి ఎల్లప్ప (36) బుధవారం మృతి చెందారు. నాలుగు రోజుల కిందట అనారోగ్యంతో బెంగుళూరులో చికిత్స పొందుతూ వచ్చారు. మంగళవారం తిరిగి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. టీడీపీ నాయకులు జింకా సూర్యనారాయణ, వేణుగోపాల్, పాముూరాయి రఘు, రాగేమురళీమోహన్ మృతదేహాన్ని సందర్శి నివాళులర్పించారు. ఫోన్‌ద్వారా ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శిగా అబ్దుల్ ఆలం

అనంతపురం విద్య, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శిగా అబ్దుల్ ఆలం నియమితులయ్యారు. మూడు రోజులుగా నగరంలో నిర్వహిస్తున్న ఆ సంఘం రాష్ట్ర మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్టు కార్యదర్శి అబ్దుల్ ఆలం పేర్కొన్నారు. కొత్త కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా జీవన్‌కుమార్, కార్యదర్శిగా అబ్దుల్ ఆలం, ఉపాధ్యక్షులుగా మౌలీ, సహాయకార్యదర్శులుగా ప్రతిభా భారతి, కోశాధికారిగా అవిన్‌బాబు, కమిటీ సభ్యులుగా రవికుమార్, అరుణ్, రవి, సంతోష్‌ను నియమించినట్టు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గార్లదిన్నె, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ విజయకుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయాలి

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బంగారంపై తీసుకున్న రుణాలకు సంబంధించి వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేయాలని పలువురు రైతులు కెనరా బ్యాంకు మేనేజర్‌ను కలిసి వివరించారు. అసలు, వడ్డీ కలిపి రెన్యూవల్ చేయడానికి ఇబ్బందులు పడుతున్నామంటూ రైతు సంఘం మండల నాయకుడు లింగన్న, బీజేపీ నాయకుడు ఆంజనేయులుతో కలిసి రైతులు బుధవారం స్థానిక కెనరాబ్యాంక్ మేనేజర్‌కు సమస్యను వివరించారు. బ్యాంకు మేనేజర్‌అనూప్ మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికితీసుకెళ్తామని తెలిపారు.

పశువులకు గర్భకోశ చికిత్సలు

గార్లదిన్నె, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గ్రామంలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్సా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణ అధికారి, డిప్యూటి డైరెక్టర్ సుధాకర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా 36 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణ మందులు పశువులకు తాపించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఆంజనేయులునాయక్, నరేష్, వెంకటకృష్ణ, మమత పాల్గొన్నారు.

రన్నరప్‌గా జిల్లా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లాకు ద్వితీయ స్థానం దక్కింది. ఈనెల 7 నుంచి 10వతేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో నిర్వహించిన 10వ ఏపీ సీనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తూర్పుగోదావరి జట్టుపై ఓడిపోయిన జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. వీరికి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి అభినందనలు తెలిపారు.



రన్నరప్‌గా నిలిచిన జిల్లా పురుషుల జట్టు

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

● శిథిలావస్థకు చేరిన వైనం ● మరమ్మతులు చేయిస్తే ఉపయోగం ● పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయం, శిథిలావస్థలో పాత ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ పాత భవనం

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగాఉన్నాయి. వాటిని పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో పక్కా భవనాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లిలో చాలా వరకు ఇలాంటి ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. ముఖ్యశాఖలకు సంబంధించిన భవనాలతోపాటు ప్రభుత్వ ఆస్పత్రి క్వార్టర్స్ నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్ కొన్నేళ్ల క్రితం కొత్త భవనాల్లోకి మారడంతో పాత భవనాలు వినియోగంలో లేకుండా పోయాయి. పాలశీతలీకరణ కేంద్రం మూతపడటంతో గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంది. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్‌భవనాలు కూడా వృథాగా ఉన్నాయి. వీటిలో కొన్ని భవనాలు పూర్తిగా దెబ్బతిని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి క్వార్టర్స్ ఒకప్పుడు సిబ్బందికి సౌకర్యంగా ఉండేది. రానురాను ఉద్యోగులు నివాసాలు లేకపోవడంతో కొన్నేళ్లుగా వృథాగా పడి ఉన్నాయి. ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉండటంతో కొన్ని అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ భవనాలను వదిలేయకుండా మరమతులు చేయించి ఇతర ప్రభుత్వ సేవలకు ఉపయోగించడం వల్ల ప్రజా ఆస్తులను కాపాడినవారవుతారని పలువురు పేర్కొంటున్నారు.

నకిలీ పాసు పుస్తకాలను ఏరివేయండి: ఎమ్మెల్యే



గొరిదిండ్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూమి కన్నా పట్టాలు ఎలా ఎక్కువ వస్తాయని, నకిలీ పాసుపుస్తకాలను ఏరివేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గొరిదిండ్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే సునీత ఆర్డీఓ కేశవనాయుడు హాజరయ్యారు. రైతుల నుంచి వచ్చిన 125పైగా సమస్యలను స్వీకరించారు. ఎక్కువగా ఒకరి భూమిని మరొకరికి ఆన్‌లైన్‌లో ఎక్కించారని, సాగులో ఒకరు, ఆన్‌లైన్‌లో మరొకరు ఉండి దొంగ పాసుపుస్తకాలు తీసుకుని బ్యాంకులో రుణాలు తీసుకున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూసమస్యలు ప్రతి గ్రామంలో ఉన్నాయని, గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో భూ అక్రమాలు చాలా జరగాయన్నారు. అందుకే గ్రామాల్లో సమస్యలు ఎక్కువ వస్తున్నాయన్నారు. నాయకుల ఒత్తిళ్లు ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా అధికారులు ఎలా చేశారని ప్రశ్నించారు. ఇలాంటి వాటిపై ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పేరూరు ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు తగిన పరిహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మానాయక్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంపీటీసీ పారిజాతమ్మ, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, శశాంక్ చౌదరి, లింగన్న, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి వేడుకలు



గీతామందిర్‌లో శ్రీకృష్ణుడు, సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక గీతా పారాయణం, ఇస్కాన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన

అనంతపురం కల్చరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ ఏకాదశి, గీతాజయంతిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని పలు ఆలయాల్లో వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో జడ్పీ ఎదురుగా ఉన్న గీతామందిరంలో కృష్ణ భగవానుడికి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. ఇస్కాన్ మందిరంలోనూ భక్తులు భగవద్గీత పారాయణాలు చేశారు. అలాగే అశోక్‌నగర్‌లోని సత్యనారాయణస్వామి దేవాలయంలో కృష్ణభగవానుడి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆలయ ఆవరణలో భక్తులు సామూహికంగా భగవద్గీత పారాయణాలు పఠించారు. కార్యక్రమంలో సత్యనారాయణస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబటి ఫణిరాజు, తిరువీదుల జగదీష్‌కుమార్, రవి, సంతోష్ పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి: ఫుడ్ కమిషన్ చైర్మన్



పిల్లలతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి

అనంతపురం విద్య, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలను ఆదేశించారు. బుధవారం ఆయన అనంతపురం నగరంలోని అశోక్‌నగర్, కృపానందనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ఎస్కేడీ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఎస్కేడీ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. తర్వాత స్థానికంగా పాఠశాల ఆవరణలో వాటర్ ప్లాంట్ చూసి ఎవరు వాడుతున్నారని ఆరా తీశారు. తమకు వంట గది కావాలని అక్కడి సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తర్వాత ఆయన హౌసింగ్‌బోర్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రాల్లో విద్యార్థుల హాజరు వివరాలు, సరుకులపై ఆరా తీశారు. విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు ఎంతమంది వస్తున్నారని ప్రశ్నించారు. విద్యార్థులు హాజరుకు, రిజిస్టర్‌లోని వివరాలకు తేడా ఉండడం చూసి.. ప్రశ్నించారు. పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఈఓ ప్రసాద్‌బాబు, ఎంఈఓ వెంకటస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మోహన్‌బాబును అరెస్ట్ చేయాలి



ఏఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడి చేసిన సినీనటుడు మోహన్‌బాబును అరెస్ట్ చేయాలని ఏపీయుడబ్ల్యుజే డిమాండ్ చేసింది. బుధవారం మోహన్‌బాబు తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రెస్‌క్లబ్ నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయుడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు సాకేహరి మాట్లాడారు. నాలుగ్గోడల మధ్య సమస్యను పరిష్కరించుకోకుండా రోడ్డెక్కి, అది చిత్రీకరించిన జర్నలిస్టులపై దాడి చేయడం బాధాకరమన్నారు. తెలంగాణ ప్రభుత్వం మోహన్‌బాబును అరెస్ట్ చేసి, ఆయనకున్న లైసెన్స్ గన్‌లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఎస్పీ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐజేయూ సభ్యులు ప్రభాకర్‌నాయుడు, మార్కండేయులు, రామాంజనేయులు, జగదీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు. మీడియా ప్రతినిధులపై మోహన్‌బాబు దాడిచేయడం హేయమైన చర్య అని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి మండిపడ్డారు. దాడిని నిరసిస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహంవద్ద నిరసన వ్యక్తంచేశారు.

సికిందర్ ఆశయాలను కొనసాగిస్తాం



సికిందర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం, ఆవాజ్ నాయకులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన పోరాటాల్లో సికిందర్ తనదైన పాత్ర పోషించారని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. సీపీఎం నాయకుడు సికిందర్ ఐదో వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక గణేనాయక్‌భవన్‌లో సీపీఎం, ఆవాజ్ సంయుక్త ఆధ్వర్యంలో సికిందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. సికిందర్ గుండెపోటుతో మృతిచెందడానికి అరగంట ముందు వరకూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన పోరాటాల్లోనే ఉన్నారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వలి, మసూద్, ఓబులేసు, రాజు, లతీఫ్, రామాంజనేయులు, నూరుల్లా, జీవ, ఆది, సికిందర్ కుటుంబ సభ్యులు దాదు, అలీ, ఇమ్రాన్, వన్నూరప్ప, చాంద్, ఎస్ఎఫ్ఐ నాయకులు భీమేష్, విజయ్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

(న్యూస్ నెట్‌వర్క్ - ఆంధ్రజ్యోతి)

భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మన్నీల, చియ్యేడు గ్రామాల్లో తహసీల్దార్ మోహన్‌కుమార్, రాజీవ్‌కాలనీ అర్బన్ తహసీల్దారు హరికుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. రాజీవ్‌కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ ఆనంద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఇళ్ల స్థలాలకు ఎనిమిది, సర్వే విభాగానికి సంబంధించి మూడు, ఆర్ఓఆర్‌కు సంబంధించి రెండు ఫిర్యాదుల వచ్చాయి. కార్యక్రమంలో సర్పంచు ఆశాబీ, కార్యదర్శి శ్రీధర్‌రావు పాల్గొన్నారు. ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని చియ్యేడు, పూలకుంట గ్రామ రైతులు తహసీల్దార్ మోహన్‌కుమార్‌ను కోరారు. కొన్ని ఏళ్లుగా భూములు చదునుచేసుకుని పంట సాగు చేస్తున్నామని తెలిపారు. మన్నీల, చియ్యేడులో 33 ఫిర్యాదులు వచ్చాయి. మండల సర్వేయర్ రఘు, ఆర్ఐ సందీప్, మన్నీల సర్పంచు త్రిలోక్‌నాయుడు, టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ మన్నిల శాఖ కార్యదర్శి వెంకటరాముడు రెవెన్యూ సదస్సులో వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, వెంకటరాముడు పాల్గొన్నారు. రాప్తాడు మండలం యర్రగుంట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 52 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. అర్జీలను వెంటనే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ రామాంజనేయులు, వీఆర్ఓ రవి, టీడీపీ నాయకుడు నారాయణస్వామి పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమ్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు మంచి అవకాశమని శింగనమల తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య పేర్కొన్నారు. సోదనపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు సందర్భంగా ఎస్సీకాలనీలో ర్యాలీ నిర్వహించి కాలనీ సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.



రాజీవ్‌కాలనీలో మాట్లాడుతున్న తహసీల్దార్ హరికుమార్

రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయం: ఎమ్మెల్యే



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

నార్పల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతన్నల సంక్షేమమే టీడీపీ ధ్యేయం అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బి.పప్పూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని తెలిపారు. కూటమి అధికారంలోనికి వచ్చాక ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారని, వైసీపీ నాయకులు ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కాశీవిశాలాక్షి ఆలయ జీర్ణోద్ధరణ



ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం, దర్శించుకుంటున్న నాయకులు

బుక్కరాయసముద్రం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దరాంపురం గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామలింగారెడ్డి రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన కాశీ విశాలాక్షి అమ్మవారి దేవాలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల నుంచి అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం వేకువజామున నుంచి హోమం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు వీటి తో పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠించారు. హిందుపురం ఎంపీ బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, నాయకులు నెట్టెం వెంకటేష్, ముంటిమడుగు కేశవరెడ్డి, పరిటాల మహేంద్ర, పర్వతనేని శ్రీధర్‌బా బు, విశాలాక్షి, అశోక్, బాలరంగయ్య, సుదర్శన్‌నాయుడు, వెంకటేశు అమ్మవారిని దర్శించుకున్నారు.

'సొంత మండలాన్ని అభివృద్ధి చేయని ప్రకాశ్‌రెడ్డి'

ఆత్మకూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి తన సొంత మండలంలో కూడా అభివృద్ధి పనులు చేయలేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముట్టాల గ్రామంలో రూ.35 లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడతూ వైసీపీ హయాంలో గ్రామాల్లో కక్షలు మాత్రమే కనిపించేవని, ఎక్కడ చూసినా పార్టీల పేరుతో రేషన్ కార్డులు, పింఛన్లు తొలగించడం వంటివి చూశామని తెలిపారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న ప్రకాశ్‌రెడ్డి ఏరోజైనా గ్రామాల్ని అభివృద్ధి చేయాలని చూశారా అని ప్రశ్నించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు..

ఆత్మకూరులోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక పూజలు నిర్వహించి మాలధారులకు అన్నదానం చేశారు. బుధవారం రాత్రి అయ్యప్పస్వామి ఆలయంలో డాక్టర్ పరిటాల స్నేహలత, వడ్లమూరి శ్రీహర్ష దంపంతులు అన్నదానం ఏర్పాటు చేశారు.

చివరి ఆయకట్టుకు నీరివ్వాలి: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

శింగనమల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మిడ్‌పెన్నార్ ఐదో దక్షిణ కాలువ కింద చివరి ఆయకట్టు వరకు సాగు నీరు ఇచ్చి రైతులను అందుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తరిమెల గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో రైతులకు సంక్షేమ పథకాలు ఇస్తామని మోసం చేశాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిన్నప్పయాదవ్, నారాయణస్వామి, మధుయాదవ్, రామాంజనేయులు, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరిమెల గ్రామానికి చెందిన బాషా, రమేష్, ఆదినారాయణ ఆధ్వర్యంలో 20 కుంటుబాలు సీపీఐలో చేరారు. జిల్లా కార్యదర్శి జాఫర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

22 నుంచి ప్రాక్టికల్స్‌ను ప్రారంభించాలి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): డిగ్రీ ఐదో సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 22 నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని ఎస్కేయూ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్(సీఈ) డాక్టర్ లోకేష్ అధికారులకు సూచించారు. బుధవారం పరీక్షల విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ ఆధ్వర్యంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈ లోకేష్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేయడానికి బోర్డ్ ఆఫ్ స్టడీస్‌ను ఏర్పాటు చేసి చైర్మన్లుగా కళాశాలల అధ్యాపకులను నియమిస్తామని తెలిపారు.

విద్యుత్‌శాఖ అధికారిపై చర్యలు తీసుకోండి

అనంతపురం రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజీవ్ కాలనీ పంచాయతీ మల్లు స్వరాజ్యం కాలనీకి విద్యుత్ లైన్ తొలగించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కాలనీ వాసులతో కలసి గుత్తి రోడ్డులోని ఏఈఈ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయంలో బైఠాయించి నిరసన తెలిపారు. కార్యాలయానికి విద్యుత్ అధికారులు రాకపోవడంతో సాయంత్రం ఆరు గంటల వరకు నిరసనను కొనసాగించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రకాష్, వలీ మసూద్, బాబా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి కోసం దరఖాస్తు చేసుకోండి

శింగనమల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇళ్లు కావలసిన అర్హులు అందరూ డిమాండ్ సర్వేలో దఖాస్తులు చేసుకోవాలని గృహ నిర్మాణశాఖ శింగనమల డీఈ రామ్మూర్తి పేర్కొన్నారు. బుధవారం శింగనమల గృహ నిర్మాణశాఖ కార్యాలయాన్ని, సి.బండమీదపల్లిలో ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు కావాల్సిన వారు స్థలం పట్టా డాక్యుమెంట్లు, నివాస ధ్రువీకరణ పత్రంతోతో స్థానిక సచివాలయంలో డిమాండ్ సర్వేలో దరఖాస్తు చేసుకోవాలని, అర్హులందరికీ మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఏఈ నామాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేరళపై కేంద్రం నిర్లక్ష్య వైఖరి: గేయానంద్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని దేశ ప్రజలంతా ఖండించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. కేరళ ప్రజల హక్కుల పరిరక్షణకు మద్దతుగా బుధవారం జేవీవీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక రాష్ట్ర ప్రజల హక్కులకు భంగం కలిగించడమంటే సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించడమేఅన్నారు. కేరళ రాష్ట్రం అక్షరాస్యతలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, ఇతర సంఘాల నాయకులు కృష్ణమూర్తి, నాగరాజు, చంద్రశేఖరరెడ్డి, సావిత్రి, వెంకటనారాయణ, ముత్తుజ, శ్రీనివాసులు, నాగభూషణం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గేయానంద్

క్లుప్తంగా..

హెచ్ఎం కొట్టారని బడిలో ఆందోళన



హెచ్ఎంతో వాగ్వాదానికి దిగిన విద్యార్థినుల తల్లిదండ్రులు

గుత్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులను హెచ్ఎం ఉషారాణి కొట్టారంటూ తల్లిదండ్రులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఉదయమే పాఠశాల వద్దకు వచ్చిన విద్యార్థినుల తల్లిదండ్రులు హెచ్ఎంను నిలదీశారు. పిల్లలను కొట్టే హక్కు ఎవరిచ్చారంటూ వాదానికి దిగారు. దీంతో పాఠశాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే పోలీసులు అక్కడకు వచ్చి తల్లిదండ్రులను సర్దిచెప్పడానికి యత్నించినా వారు వినలేదు. తమ పిల్లలను ఎందుకు కొట్టారో చెప్పాలంటూ పట్టుపట్టారు. పిల్లలను తాను కొట్టలేదని, కేవలం మందలించానంటూ హెచ్ఎం సమాధానమిచ్చారు. సమాధానపడని తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి హెచ్ఎంపై ఫిర్యాదుచేశారు. ఎస్ఐ సురేశ్ బాధిత విద్యార్థినులకు పిలిచి విషయాన్ని అడిగి తెలుసుకుని తల్లిదండ్రులకు సర్ది చెప్పి పంపించేశారు.

గుత్తి కోటను సందర్శించిన ఆర్పీఎఫ్ డీఎస్పీ



మన్రో సమాధిని సందర్శిస్తున్న ఆర్పీఎఫ్ డీఎస్పీ తదితరులు

గుత్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చారిత్రక గుత్తి కోటను ఆర్పీఎఫ్ డీఎస్పీ అనిల్‌కుమార్ సింగ్ బుధవారం సందర్శించారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయనకు కోట పరిరక్షణ సమితి సభ్యులు, పురావస్తు శాఖ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. తొలుత కోట కింది భాగంలో ఉన్న ఆంగ్లేయుల సమాధులను, సర్ థామస్ మన్రో సమాధిని డీఎస్పీకి చూపారు. తర్వాత కోటపైన బావులు, ఏనుగుశాలలు, గుర్రపుశాలలు తదితరాలను చూపించి చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఐపీఎఫ్ అనురాగ్, కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, నాయకులు బాబా సాహెబ్, జిలాన్, పురావస్తు సిబ్బంది ఆంజనేయులు, అమృత్, శ్రీరాములు పాల్గొన్నారు.

మండల అభివృద్ధే లక్ష్యం: ఎంపీడీఓ

పామిడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు విధులు నిర్వహించాలని ఎంపీడీఓ తేజోత్స్న సూచించారు. మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం, పంచాయతీ రాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రఘురామారావు సుస్థిర మండల అభివృద్ధిపై అన్ని శాఖల అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ లకు రెండు రోజుల శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. 16, 17వ తేదీలలో సచివాలయాల సిబ్బందికి మరొకసారి శిక్షణ ఉంటుందని తెలిపారు.

యాడికి: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్థానిక సుస్థిర అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులకు, అధికారులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ దేవకుమార్ మాట్లాడుతూ స్థానిక సుస్థిర అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా కృషిచేద్దామని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి కల్పన, పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్లు, సంక్షేమ పథకాల లబ్ధి తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ శశికళ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేశ్వరరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కసాపురంలో గీతా హోమం

గుంతకల్లు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని కసాపురం దేవస్థానంలో బుధవారం హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని యాగశాలలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటుచేసి, అలంకారాలు చేశారు. కలశ స్థాపన, భగవద్గీతా పారాయణం, హోమ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన

కూడేరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలోని 535 సర్వే నెంబరులో ఉన్న ఏపీఐఐసీ, అహుడాలకు కేటాయించిన భూములను జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ బుధవారం పరిశీలించారు. అనంతరం సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనంతపురం -బళ్లారి ప్రధాన రహదారి నుంచి ఏపీఐఐసీ భూముల్లోకి 100 అడుగుల అప్రోచ్ రోడ్డును త్వరితగతిన గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ చెన్నకేశవులు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ దబ్బర ప్రసాద్, మండల సర్వేయర్ అయేషా సిద్ధి తదితరులు ఉన్నారు.

ఇరుముడి ఏర్పాట్ల పరిశీలన

గుంతకల్లు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం నిర్వహించనున్న ఇరుముడుల సమర్పణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి బుధవారం పరిశీలించారు. తొలుత గుంతకల్లు పట్టణంలో హనుమాన్ దీక్షాపరుల నడకదారిని శుభ్రం చేయించారు. బళ్లారి బైపాస్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి కసాపురం రోడ్డు వరకూ ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ముందువైపు పారిశుధ్య సిబ్బంది రహదారిని శుభ్రం చేస్తూ ఉండగా.. వారి వెంట టీడీపీ నాయకులు ర్యాలీగా వెళ్లారు. అనంతరం కసాపురం ఆలయం వద్దకు వెళ్లి అక్కడ ఇరుముడులను సమర్పించడానికి వచ్చే మాలాధారులకు తాగునీరు, వసతి, వైద్య సదుపాయాలను పరిశీలించారు. నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, గుజరీ ఖాజా, కృపాకర్, ప్రభాకర్, శివన్న, అంజి, వీరేశ్, ఫజులు, ఆటో ఖాజా, తదతరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పామిడి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 6, 7వ వార్డులలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయా వార్డు ప్రజలు పూలమాలలు, శాలువాతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ట్రాన్స్ కో ఏఈ మధుసూదన్‌రావు, ఈఓ గోపాల్, టీడీపీ నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి, జింకల సంజీవకుమార్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని పాళ్యం గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గుమ్మనూరు ఈశ్వర్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని మండల నాయకుడు బోయ శేఖర్ వాటిని సమకూర్చారు. ఈశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇవేం బాడుగలు బాబోయ్..

- భారీగా పెరిగిన వరి కోత మిషన్ల అద్దె
- గంటకు రూ.3500 చొప్పున వసూలు
- యంత్రాల యజమానులు, దళారీల సిండికేట్
- రైతులకు అదనపు భారం



రంగాపురం క్యాంపు వద్ద వరికోత కోస్తున్న చైన్ మిషన్

బొమ్మనహాళ్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో దుక్కి చేయడం మొదలు దిగుబడి విక్రయించే వరకు అన్నదాతలు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుకోవాల్సి వస్తోంది. ఇంత చేసినా లాభాలు మాత్రం అంతంతగా వస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఒక వైపు తెగుళ్లు.. మరో వైపు వర్షాల వల్ల వరి పంట నేలకొరిగి ధాన్యం రాలిపోయి కొంత నష్టాన్ని మిగిల్చింది. ఉన్న కాస్త దిగుబడిని పొందేందుకు వరికోతకు సిద్ధమవగా కోత కోసే యంత్రాల బాడుగలు మోత మోగుతున్నాయి. ప్రస్తుతం మండలంలో వరికోతలు మొదలయ్యాయి. దీంతో కోత కోసే యంత్రాల బాడుగలు భారీగా పెరిగాయి. తుఫాన్లు, అకాల వర్షాలతో ముప్పు పొంచి ఉందనే ఆందోళనతో రైతులు ఎంత ఖర్చుకైనా వెనుకాడకుండా వరికోతలను ముమ్మరం చేసే పనిలో నిమగ్నమవుతున్నారు.

భారీగా యంత్రాల బాడుగలు..

వరి కోతల కోసం రైతులు యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. డీజిల్ ధరలను కారణంగా చూపుతూ వరికోత యంత్రాల యజమానులు బాడుగలను పెద్దఎత్తున పెంచేశారు. రైతుల నుంచి డిమాండ్ అధికంగా ఉండడంతో యజమానులు, దళారీలు సిండికేటై అమాంతంగా బాడుగలు పెంచేశారు. చైన్ యంత్రాలకు గంటకు రూ. 3500, టైర్ల యంత్రాలకు రూ. 3000 పైబడి తీసుకుంటున్నారు. ఒక ఎకరా వరికోతకు రెండు గంటల సమయం పడుతుండడంతో రైతు దాదాపు రూ. 7 వేలు చెల్లించాల్సి వస్తోంది. గత ఏడాది చైన్ యంత్రానికి రూ. 2500, టైర్ల యంత్రానికి రూ. 1800 నుంచి రూ.2000 వరకు ఉండేవి. అయితే ఈ ఏడాది ఉన్నఫలంగా బాడుగలు పెంచేశారు. కర్ణాటకలోని గంగావతి, కంప్లి ప్రాంతాల నుంచి ఈ యంత్రాలు వస్తున్నాయి. యజమానులు ఇక్కడ ఏజెంట్లను పెట్టుకుని వరి కోతలు చేస్తున్నారు. ఏజెంట్లు చెప్పిన వారి పంటలే కోతలు చేయాలి. రైతుల నుంచి డబ్బు ఇప్పించే బాధ్యత ఏజెంట్‌కు ఉంటుంది. ఇందుకు ఏజెంట్ గంటకు రూ. 500 కమీషన్ ఇస్తున్నారు.

భారమైనా.. తప్పక..

మండలంలో ప్రస్తుతం వరికోతలు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో హెచ్చెల్సీ ఆయకట్టుతో పాటు శ్రీధరఘట్ట చెరువు కింద, బోరు బావులు, వేదావతి పరివాహక ప్రాంతాల్లో వరి పంటను 20 వేల హెక్టార్లలో పైగా సాగు చేశారు. ఇప్పటికే వరికోతలు మొదలయ్యాయి. అయితే యంత్రాలు అందుబాటులో లేక పోవడం వల్ల ప్రస్తుతం 10 శాతం కూడా పూర్తి కాలేదు. అదునుగా భావించిన యంత్రాల యజమానులు బాడుగలు అమాంతం పెంచేశారు. దీనికి తోడు తుఫాన్ల ప్రభావం కొనసాగుతుండడంతో రైతులు వర్షం నుంచి పంటను కాపాడుకోవడానికి తాపత్రయ పడుతున్నారు. ఈ క్రమంలో బాడుగలు పెంచినా విధిలేని పరిస్థితుల్లో ఆ యంత్రాలతో కోతలు చేయిస్తున్నారు. వరికోతల యంత్రాల ఖర్చుతో పాటు ధాన్యాన్ని ట్రాక్టర్లతో తరలించేందుకు రవాణా చార్జీలు తడిసి మోపెడవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సేద్యం ఖర్చు పెరిగింది



వరి సాగుకు ప్రతి ఏడాది ఖర్చు పెరుగుతోంది. నేను రెండు ఎకరాలలో వరి సాగుచేశాను. ఇటీవల తుఫాన్ కారణంగా పంట కొంత వరకు దెబ్బతింది. ఉన్న పంటను కోత కోద్దామంటే యంత్రాలకు డిమాండ్ ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాను.

- సంజీవ, రైతు, లింగదహాళ్

అడిగినంత చెల్లిస్తున్నాం



వరి కోతలు మొదలయ్యాయి. వరికోత యంత్రాలకు డిమాండ్ ఎక్కువైంది. పంటను కోత కోయించి అమ్ముకునేందుకు వరి కోతల యంత్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ యంత్రాలు స్థానికంగా ఎక్కువ లేకపోవడంవతో దూరప్రాంతాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తోంది. దీంతో వారు అడిగినంత చెల్లించక తప్పడం లేదు.

- ఈశ్వర, రైతు, శ్రీధరఘట్ట

ఏటా పెంచుతున్నారు.



వరి కోత యంత్రాల యజమానులు ఏడాదికేడాది బాడుగలు పెంచుతున్నారు. ఈ సారి ఒకేసారి రూ. 1000 పెంచి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. బ్రోకర్లను ఆశ్రయిస్తేనే కోతకు యంత్రాలను పంపిస్తారు. అందరూ కలసి రైతులపై భారం వేస్తున్నారు. తుఫాన్ వల్ల ఇప్పటికే కొంతవరకు పంట దెబ్బతింది. ఇప్పుడు ఈ అదనపు బాడుగల భారం పడుతోంది.

- రామాంజనేయులు, రైతు, జనార్ధనపల్లి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

పుట్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్ర భుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని శనగలగూడూరు గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దుచేసి, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందని తెలిపారు. గత వైసీపీ పాలనలో పేదల భూములను దౌర్జన్యంగా ఆక్రమించి, రైతులను ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలను వెలికితీసి ప్రజలకు న్యాయం చెయాలనే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తర్వాత చింతకుంట వద్ద గండి పడిన హెచ్చెల్సీ కాలువను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు కులశేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, చెన్నారెడ్డి, శివశంకర్‌రెడ్డి, శివారెడ్డి , పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

పామిడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు మోహన్‌బాబు మీడియాపై దుర్భాషలాడి దాడికి పాల్పడడం హేయమని, అతడిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల పాత్రికేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... న్యూస్ కవరేజ్ కోసం వేచి ఉన్న పాత్రికేయులపై దాడికి పాల్పడడం అప్రజాస్వామికమన్నారు.

అంగన్‌వాడీకేంద్రాలను ఏర్పాటు చేయండి

తాడిపత్రి, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రమేష్‌రెడ్డికాలనీ, గోపాల్‌రెడ్డికాలనీ, ఆర్టీటీ కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటుచేయాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఐసీడీఎస్ కో ఆర్డినేటర్ పల్లవికి, ఎంపీడీఓకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకుడు ఉమాగౌడ్ మాట్లాడుతూ.. ఈ కాలనీల్లో అనేకమంది బీడీకార్మికులు, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారున్నారన్నారు. వీరి పిల్లలకు సరైన విద్యాబోధన, పౌష్టికాహారం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో కూడా అనేకమార్లు అంగన్‌వాడీ సెంటర్లు ఏర్పాటు చేయాలని విన్నవించామన్నారు. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, నాయకులు రవికుమార్, నాగేంద్ర, రాజు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలను ఘనంగా జరుపుదాం

- ఆలయ కమిటీ చైర్మన్ దేవినేని అవినాష్



దేవినేని అవినాష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఘనంగా జరుపుకుందామంటూ ఆ ఆలయ కమిటీ చైర్మన్ దేవినేని అవినాష్ పిలుపునిచ్చారు. ఆలయంలో బుధవారం రాత్రి ఆయన కమిటీ సభ్యులు, భక్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలను దాతలు, పుర ప్రముఖుల సహకారంతో వైభవంగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాలకు అవసరమయ్యే ఖర్చులపై కమిటీ సభ్యులతో చర్చించారు. పట్టాభిరామస్వామి ఆలయ అభివృద్ధి కోసం మొట్టమొదటి విరాళం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు రూ. మూడు లక్షలు అందించినట్లు గుర్తు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా తనను ఎన్నుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఆలయ అభివృద్ధికి విరాళాలు అందించాలని అవినాష్ కోరడంతో.. ఓ దాత రూ. 3 లక్షలు అందించేందుకు ముందుకొచ్చారు. దీంతో ఆయన్ను అందరూ అభినందించారు. అనంతరం అవినాష్‌ను కమిటీ సభ్యులు, భక్తులు పూలమాల, శాలువాతో సన్మానించారు.

వృద్ధాశ్రమానికి రూ. 50 వేల వితరణ

గుంతకల్లు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొత్తగా ప్రారంభించిన సంచార జాతుల వృద్ధాశ్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రూ. 50 వేల విరాళం అందజేశారు. పాతగుంతకల్లులోని హౌసింగ్ బోర్డు కాలనీకి సమీపంలో ఏర్పాటుచేసిన సంచార జాతులకు చెందిన 28 మంది వృద్ధులకు ఆశ్రయాన్నివ్వడానికి ఇందిరా వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. దానిని బుధవారం టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి ముఖ్య అతిథిగా వచ్చి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకటించిన రూ. 50 వేల విరాళాన్ని నిర్వాహకురాలు ఇందిరమ్మకు అందజేశారు. సంచార జాతులకు చెందిన వారు వృద్ధుల కోసం ఆశ్రమాన్ని ఏర్పాటుచేయడం హర్షించదగ్గ విషయమన్నారు. తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, పత్తి హిమబిందు, తలారి మస్తానప్ప, ప్రభాకర్, శివన్న, సంచార జాతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొట్టు కుళ్లాయప్ప, బాల సంతు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవ తదితరులు పాల్గొన్నారు.


ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం సీజ్‌చేసినట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. తాడిపత్రి నుంచి నంద్యాలకు రెండు ఇసుక ట్రాకర్లు వెళ్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే వెళ్లి పట్టుకుని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామని చెప్పారు. అనంతరం డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

ఉరవకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లినికి టీడీపీ నాయకుడు వెంకటేష్ గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్ తదితరులు గ్రామానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. తర్వాత పయ్యావుల శ్రీనివాసులు రూ.30వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి నాయకుల చేతుల మీదుగా అందజేశారు. నాయకులు రేగాటి నాగరాజు, తిమ్మప్ప, యర్రగుంట్ల వెంకటేష్ ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి: జేసీ



సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

కూడేరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సూచించారు. మండలంలోని కొర్రకోడులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కువగా భూ తగాదాలకు సంబంధించిన అర్జీలే వస్తున్నాయన్నారు. రికార్డులలో భూముల నమోదు సక్రమంగా ఉంటే... వివాదాలను పరిష్కరించే అవకాశముంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జనవరి 8వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని, ఆ లోగా భూ సమస్యలున్న రైతులు అర్జీలు ఇస్తే... పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం గ్రామస్థులు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 87 అర్జీలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆర్డీఓ కేశవనాయుడు, డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్, దేవాదాయశాఖ ఈఓ రమేష్, వీఆర్వో లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: మండలంలోని రాచర్ల గ్రామం లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డీఆర్వో మలోల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సదస్సులో వచ్చిన అర్జీలను త్వరిత గతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సదస్సులో 29అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. డీటీ భోగన్‌గౌడ్, మండలసర్వేయర్ రత్నాకర్, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని బసాపురం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో వసంత బాబు పాల్గొన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామస్థులు ఇచ్చిన అర్జీలను స్వీకరించి పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది, దేవాదాయశాఖాధికారులు, గ్రామ సచివాలయం సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 27 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ షర్మిల, వీఆర్వో ఎర్రిస్వామి తెలిపారు. డీటీ హారిక టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎంపీపీ పెద్దన్న, జనసేన , బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని జుంజురంపల్లిలో రెవెన్యూసదస్సు సర్పంచ్ వన్నూరుస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ భూ సమస్యలుంటే రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలని, 45 రోజుల్లోగా సమస్యను పరిష్కారం చేస్తామని అన్నారు. అనంతరం రైతులు 11 అర్జీలు అందజేశారు. సర్వేయర్ మణికాంత్, ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్ నాగరాజు, వీఆర్వో, ఆర్ఐ, రైతులు పాల్గొన్నారు.

జేసీపీఆర్‌ను కలిసిన హైకా కంపెనీ సీఈఓ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీపీఆర్

తాడిపత్రి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని ఎలక్ట్రిక్ వాహనాల సంస్థ అయిన డీజేటీ హైకా కంపెనీ సీఈఓ సంజయ్‌కుమార్ కలిశారు. పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ వాహనాల చార్జింగ్ సెంటర్ల ఏర్పాటు గురించి చర్చించారు. చార్జింగ్ సెంటర్ల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సీఈఓ వివరించారు. కాలుష్య నివారణకు ఎలక్ట్రికల్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. అనంతరం కంపెనీకి సంబంధించిన బ్రోచర్‌ను జేసీపీఆర్ చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



విత్తనవేరుశనగను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

కూడేరు, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో సాగు చేయనున్న వేరుశనగలో మంచి దిగుబడి సాధించాలంటే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని మరుట్లలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని, ఏదేని సమస్య వస్తే వారిని సంప్రదించాలని సూచించారు. మంచి దిగుబడి సాధించాలంటే సస్యరక్షణ చర్యలు అవసరమన్నారు. అలాగే ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకం గురించి వివరించారు. అనంతరం రైతులకు రబీ సీజన్‌కు అవసరమైన విత్తన వేరుశనగను సబ్సిడీ కింద పంపిణీ చేశారు. ఏఓ విజయ్‌కుమార్, రైతు సేవాకేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

గుమ్మఘట్ట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆర్డీటీ, మహిళా,శిశుసంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఉరవకొండ ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ కృష్ణవేణి, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, వైద్యాధికారులు రమేష్, సుధేష్ , ఎస్ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు. సీడీపీఓ మాట్లాడుతూ గుమ్మఘట్టను బాల్యవివాహాలు లేని మండలంగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక , శారీరక రుగ్మతలకు గురవుతారన్నారు. ఎవరైనా బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా శిక్షకు అర్హులవుతారన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీటీ మహిళా అభివృద్ధి విభాగం టీ లీడర్ ఆదినారాయణ, కేజీబీవీ ప్రిన్సిపాల్ షబానా, సిబ్బంది వైద్యసిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీపై చర్యలు తీసుకోవాలి

- ఆశావర్కర్ల డిమాండ్.. రాస్తారోకో

ఉరవకొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లను వేధిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ సులోచనపై చర్యలు తీసుకోవాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆమె బుధవారం ఆశా వర్కర్లతో కలిసి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట గుంతకల్లు, అనంతపురం రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఆశా వర్కర్ ఆత్మహత్య యత్నానికి కారణమైన ఎంఎల్‌హెచ్‌పీని వెంటనే సస్పెన్షన్ చేయాలన్నారు. రాస్తారోకో వద్దకు ఎస్ఐ జనార్ధన్‌నాయుడు చేరుకుని రాస్తారోకో విరమించాలని కోరారు. ఎంఎల్‌హెచ్‌పీపై చర్యలు తీసుకునేంత వరకూ విరమించే ప్రసక్తే లేదని వారు తేల్చి చెప్పారు. ఎస్ఐ సర్ది చెప్పడంతో రాస్తారోకోను విరమించారు. ఐదో సచివాలయంలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ సులోచన ఆశా వర్కర్ శర్మస్ బీపై రెండు సార్లు దాడి చేసినట్లు ఎస్ఐకి చెప్పారు. ఫిర్యాదు చేస్తే విచాణ చేస్తామని ఎస్ఐ ఆశా వర్కర్లకు సూచించారు. అనంతరం పీపీ యూనిట్‌కు చెందిన వైద్యులు సాహితి, వినీత ఆశా వర్కర్లతో మాట్లాడి సంఘటనపై ఆరా తీశారు. సీపీఎం నాయకులు రంగారెడ్డి, శీనప్ప పాల్గొన్నారు.

ఎట్టకేలకు రాళ్ల తొలగింపు

యాడికి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూట్రాళ్లపల్లి గ్రామంలో ఎట్టకేలకు బుధవారం రస్తా వివాదంలో రాళ్లను అధికారులు తొలగించారు. తూట్రాళ్లపల్లిలో వెంకటనాగిరెడ్డి, ఆదిరెడ్డిలకు ఇళ్లవద్ద గత కొద్ది సంవత్సరాలుగా రస్తా వివాదం ఉంది. దీనిపై వెంకటనాగిరెడ్డి ఉపలోకాయుక్తకు వెళ్లడంతో రస్తాలో రాళ్లను తొలగించాలని ఉత్తర్వులు ఇచ్చింది. గ్రామపంచాయతీ అధికారులు రాళ్లను తొలగించడానికి గతంలో రెండుసార్లు వెళ్లి వెనుదిరిగి వచ్చారు. బుధవారం ఎంపీడీఓ వీరరాజు, ఈఓపీఆర్‌డీ శశికళ, గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్, ఎస్ఐ వెంకటరమణయ్య వివాదాస్పద రస్తా వద్దకు వెళ్లారు. సిబ్బందితో రాళ్లను తొలగింపజేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామంలో ఓ మహిళ ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామానికి చెందిన ఉమాదేవి కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలతో బాధపడుతుండేది. ఈ క్రమంలో బుధవారం తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. ఒంటిపై కార్పెంట్ ఆయిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే బంధువులు గమనించి మంటలు ఆర్పి ఆమెను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తూ బీహార్ యువకుడి మృతి

విడపనకల్లు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడదన బెంచి గ్రామంలో గల కంకర మిషన్ బెల్టుకు తగులుకుని బీహార్‌కు చెందిన యువకుడు మృతి చెందాడు. కంకర క్వారీలో బీహార్‌కు చెందిన యువకుడు మనీష్ కుమార్(19) ఏడాది కాలంగా పని చేస్తున్నాడు. కాగా బుధవారం సాయంత్రం రన్నింగ్‌లో ఉన్న కంకర మిషన్ వద్ద పనులు చేస్తుండగా ప్రమాద వశాత్తు కన్వేయర్ బెల్టుకు తగిలాడు. తోటి సిబ్బంది వెంటనే మిషన్ బంద్ చేయగా అప్పటికే యువకుడు కన్వేయర్ బెల్టుకు ఇరుక్కుని మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రత్యేక సబ్ జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీహరి

గుత్తి, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రత్యేక సబ్ జైలును ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి శ్రీహరి తనిఖీచేశారు. సబ్‌జైలులోని బ్యారెక్‌లు, మరుగుదొడ్లు, వంట గది, స్టోర్ రూమును తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. జైలు ఆవరణలో కంపోస్టు బిన్‌ను ఏర్పాటుచేయాలని సబ్ జైలర్ మహేశ్వర్‌కు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సూర్య నారాయణ, నరసింహ నాయుడు, కోర్టు ఉద్యోగి సాదిక్ వలి పాల్గొన్నారు.